ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై చీటింగ్ కేసు 7

'ఆదిత్య' విద్యార్థుల హ్యాండ్ రైటింగ్ మారథాన్ 6

వెన్నెల్లో.. హాయ్.. హాయ్..



దిండి వద్ద రాత్రి బస కల్పించే ఏపీటీడీసీ హౌస్‌బోటు

- ఉమ్మడి తూ.గో. జిల్లాలో పర్యాటకం పరుగులు పెట్టేలా ప్రభుత్వం కసరత్తు
- త్వరలో గోదావరిలో రాత్రివేళల్లోను హౌస్‌బోట్లలో పర్యాటకులకు బస సదుపాయం
- కోనసీమ జిల్లాలో దిండి నుంచి అంతర్వేది వరకు విహరించేలా ఏపీటీడీసీ, ప్రైవేటు బోట్లు
- ప్రస్తుతం ఒక్క బోటే అందుబాటులో.. ఇందులో రాత్రి బసకు యమా డిమాండ్
- అటు పాపికొండలకు వెళ్లే పర్యాటకులు ఒకటి రెండు రోజులు బోటులో ఉండేలా ప్లాన్
- ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం వరకే రాకపోకలు
- అటు కాకినాడ హోప్‌ఐలాండ్‌కు మరో రెండు నెలల్లో బోటు షికారు ప్రారంభించే అవకాశం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గోదావరి నది అందచందాల గురించి వర్ణించడానికి మాటలు చాలవు.. వంపులు పోతూ వయ్యారాలు ఒలికించే నదీ పాయలు.. కొండల నడుమ నుంచి పారే నీరు.. ఒకపక్క ఇసుక తిన్నెలు.. ప్రకృతి సౌందర్యాలు అన్నీ ఇన్నీ కావు.. అంతేకాదు అలా గోదావరిలో బోటుపై రాత్రి బస చేస్తూ నదిలోంచి వెన్నెలను చూస్తే ఆ మజాయే వేరు.. చెప్పాలంటే వెన్నెల్లో గోదావరి అందాలు అనంతం...అయితే ఈ తీపి జ్ఞాపకాలు పర్యాటకులకు అందించేలా రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం కోనసీమ జిల్లా దిండి, పాపికొండల్లోను ఏపీటీడీసీ, ప్రైవేటు హౌస్‌బోట్లను త్వరలో పెద్దఎత్తున అందుబాటులోకి తీసుకురాబోతోంది. ప్రస్తుతం ఉదయం పూట మాత్రమే గోదావరి అందాలు పర్యాటకులకు కనువిందు చేస్తుండగా, త్వరలో రాత్రి వేళల్లోను గోదావరి అందాలు కనులారా వీక్షించేలా బోట్లకు అనుమతులు ఇవ్వబోతోంది. అటు కాకినాడ నుంచి హోప్‌ఐలాండ్‌కు సైతం బోటు షికారును పునరుద్ధరించబోతోంది.

ఎన్నెన్ని అందాలో...

రాజమహేంద్రవరం నుంచి కోనసీమ జిల్లా వరకు అఖండ గోదావరి పర్యాటకులను ఎంతగానో అలరిస్తోంది. పాపికొండల నుంచి దిండి వరకు సువిశాల నదీ ప్రాంతం, చుట్టూ అనేక కొండలు, మధ్యలో లంకలు.. చూడ్డానికి రెండు కళ్లు చాలవు. ప్రకృతి అందచందాలకు నెలవైన గోదావరిని పర్యాటకపరంగా మరింత పెద్దఎత్తున ఉపయోగించాలని రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో ప్రధానంగా గోదావరి అంటే బోటు షికారు ఒక్కటే కాకుండా రాత్రివేళ సైతం గోదావరి అందాలు చూడడంతో పాటు బోటులోనే రాత్రివేళ బస చేసి తనవితీరా జ్ఞాపకాలు పోగేసుకునేలా చేయడానికి భారీగా బోట్లను సిద్ధంచేస్తోంది. రాష్ట్రపర్యాటక అభివృద్ధి సంస్థతోపాటు, ప్రైవేటు సంస్థల నుంచి హౌస్ బోట్లను టెండర్ల ద్వారా రంగంలోకి దించబోతోంది. వీటిని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాతోపాటు తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నుంచి పాపికొండల వరకు పగలు, రాత్రివేళల్లో తిప్పబోతోంది. ప్రధానంగా కోనసీమ జిల్లాలోని దిండి వద్ద ప్రస్తుతం ఏపీటీడీసీకి చెందిన రెండు హౌస్‌బోట్లు అందుబాటులో ఉన్నాయి. ఒకటి మరమ్మతులకు గురవగా, మరొకటి పర్యాటకులను గోదావరిలో తిప్పుతోంది. రాత్రిపూట సైతం దిండి రిసార్టుకు అనుకుని గోదావరిలో దీన్ని ఉంచి పర్యాటకులకు బస సదుపాయం కల్పిస్తోంది. రెండు పడక గదులు ఉండే ఈ హౌస్ బోటులో రెండు కుటుంబాలు పిల్లలతో గడిపేలా ప్యాకేజీలు వసూలు చేస్తోంది. ఒక్కో కుటుంబానికి 24 గంటల విహారం, బసకు రూ.15వేలు వసూలు చేస్తోంది. రాత్రికి దిండికి తీసుకువచ్చి బోటులోనే నదిలో ఉంచుతోంది. దీనికి డిమాండ్ ఉండడంతో త్వరలో ఆరు వరకు ఈ తరహా బోట్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇందులో ఏపీటీడీసీ రెండు మిగిలినవి ప్రైవేటు బోట్లు ఉండేలా అధికారులు టెండర్లు సిద్ధం చేశారు. ఇవి అంతర్వేదితోపాటు అలా నదిలో పర్యాటకులను తిప్పి రాత్రికి తీసుకువస్తాయి. తిరిగి ఉదయం వరకు నదిలోనే ఈ బోటులో బసచేయవచ్చు. అటు పాపికొండలకు పర్యాటకుల నుంచి డిమాండ్ అధికంగా ఉంటోంది. అయితే గండిపోచమ్మ ఆలయం నుంచి పాపికొండలకు వెళ్లే బోట్లన్నీ తిరిగి సాయంత్రానికి వచ్చేస్తాయి. కానీ రాత్రివేళ గోదావరి అందాలు తనివితీరా చూసే అవకాశం ఎవరికీ లేదు. ఈ నేపథ్యంలో త్వరలో పాపికొండల వరకు హౌస్‌బోట్లో వెళ్లి ఒకటి రెండురోజులు బోట్లలోనే బసచేసి తిరిగి వచ్చేలా చేయడానికి పర్యాటకశాఖ సన్నాహాలు చేస్తోంది. రాత్రివేళ ఇసుకతిన్నెలకు కాస్త సమీపంలో సురక్షితంగా లంగరు వేయడం లేదా ఏదైనా ప్రాంతానికి సమీపంలో బోటును నిలిపి ఉంచి అందులో బస ఉండేలా చేయబోతున్నారు. ప్రస్తుతం ఇక్కడకు ఏపీటీడీసీకు ఒక్క బోటే ఉంది.

హోప్ ఐలాండ్‌కు చలో..

కాకినాడ నుంచి సముద్రంలో ప్రయాణించి హోప్‌ఐలాండ్‌కు బోటులో వెళ్తే ఆ మజాయే వేరు. చుట్టూ సముద్రం, కళ్లముందు నుంచే వెళ్లే భారీ నౌకలు.. సముద్రం మధ్యలో సుందరమైన దీవి హోప్‌ఐలాండ్. గత వైసీపీ ప్రభుత్వం హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు నిలిపివేసింది. దీంతో పర్యాటకులు ఎంతో నిరాశకు గురయ్యారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తిరిగి హోప్‌ఐలాండ్‌కు బోటు షికారు ప్రారంభించేలా చర్యలు చేపట్టింది. పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడంతో సర్వీసులు మొదలుపెట్టడానికి సమ్మతించారు. ఇటీవల ఓ కంపెనీ పర్యాటక శాఖ మంత్రిని కలిసి బోటు షికారు ప్రారంభించడానికి సమ్మతి తెలిపింది. త్వరలో టెండర్లు పిలిచి రెండు లేదా మూడు నెలల వ్యవధిలో బోటు షికారు ప్రారంభిస్తారు.





వేగం.. ప్రాణం

రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు-కాతేరు మధ్యలో గోదావరి గామన్ బ్రిడ్జి రోడ్డులో బోల్తా కొట్టిన కావేరీ బస్సు



ప్రమాదంలో మరణించిన హోమిని కళ్యాణి (ఫైల్‌ఫొటో).. విలపిస్తున్న తల్లి, బంధువులు

అర్ధరాత్రి ఘోర ప్రమాదం

గామన్ బ్రిడ్జి రోడ్డులో కాతేరు వద్ద కావేరి ట్రావెల్స్ బస్సు బోల్తా

యువతి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు..

17మందికి గాయాలు -7లో

అదుపు తప్పిన ప్రైవేట్ ట్రావెల్స్.. పెరుగుతున్న ప్రమాదాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రైవేట్ బస్సులు అదుపు తప్పుతున్నాయి. పరిమితులను మించి, నిబంధనలను దిక్కరించి రోడ్ల మీద వేగంగా పరిగెడుతున్నాయి. జాతీయ రహదారుల్లో ఈ బస్సుల వేగం చూస్తే ఎవరికైనా భయం కలగవలసిందే. అనేక ప్రమాదాలు చేస్తూ క్షేమంగా ఇంటికి చేరవలసిన మనుషులను కాటికి పంపిస్తున్నాయి. రాజమహేంద్రవరం నాలుగో గోదావరి బ్రిడ్జి అప్రోచ్ రోడ్డులో బుధవారం అర్థరాత్రి కావేరి ట్రావెల్స్ బస్సు బోల్తా కొట్టిన ప్రమాదంలో ఒక యువతి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రగాయాలతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, రాజమండ్రి జీజీహెచ్‌లో మరో ముగ్గురు ఐసీయూలో ఉన్నారు. చాలామంది గాయపడ్డారు. ఈ ప్రమాదానికి కారణం ఎవరు ఏమి చెప్పినా వేగమే ప్రధాన కారణం. ఇటీవల ఈ రోడ్డు మీద మరమ్మతులు చేస్తున్నారు. ప్లాస్టిక్ బ్లాకలు అడ్డంగా పెట్టి ట్రాఫిక్ డైవర్ట్ చేస్తున్నారు. బుధవారం పనులు చేసిన అధికారులు రోడ్డు డైవర్షన్ కోసం పెట్టిన ప్లాస్టిక్ బ్లాకలను తీయలేదు. కావేరి బస్సు డ్రైవర్ అతి వేగంగా రావడం, దగ్గరగా వచ్చిన తర్వాతే బ్లాక్‌ను చూసి డైవర్షన్ రోడ్డులోకి సడన్‌గా తిప్పే ప్రయత్నంలో ప్రమాదం జరిగినట్టు రవాణాశాఖ అధికారుల కథనం.

స్పీడ్ నియంత్రణ పట్టించుకోని డ్రైవర్లు

జాతీయ రహదారుల్లో కూడా వాహనాల వేగానికి నియంత్రణ ఉంది. కానీ ఎవరూ పట్టించుకోరు. అతివేగంగా తక్కువ సమయంలోనే గమ్యం చేరిపోవాలనే ఆలోచనతో ఈ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎక్స్‌ప్రెస్ హైవేలు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో వాహనాల వేగానికి అధికారుల నిర్ణయించిన వేగం పరిమితి ఉంది. కానీ రోడ్డెక్కితే చాలు అడ్డూఅదుపూ లేదు. ఎక్స్‌ప్రెస్ హైవేలలో గంటకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగం వరకూ వెళ్లవచ్చు. గోదావరి జిల్లాల్లో గుండుగొలను నుంచి కొవ్వూరు టోల్‌ప్లాజా వరకూ ఉన్న రోడ్డు మాత్రమే ఎక్స్‌ప్రెస్ హైవే. ఈ రోడ్డు ఆరు వరసల వరకూ ఉంది. లారీలకు 80 నుంచి 100 కిలోమీటర్ల వేగం వరకూ అనుమతి ఉంటుంది. ఇక మిగతావన్నీ జాతీయ రహదారులు, స్టేట్ రహదారులే. మిగతాచోట్ల 80కు మించి వెళ్లకూడదు. ఆర్టీసు బస్సుల స్పీడ్ కేవలం గంటలకు 60 కిలోమీటర్లు మాత్రమే. అమరావతి, ఇందా వంటి బస్సులకు మాత్రం గంటకు 80 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళ్లడానికి అనుమతి ఉంది. కాలేజీ, స్కూల్ బస్సులు కూడా గంటకు 60 కిలోమీటర్ల వేగంకంటే ఎక్కువ వేగంతో నడపకూడదు. హైవేలో కార్లు, మోటారు సైకిళ్ల 70 కిలోమీటర్ల వేగం వరకే వెళ్లాలి. రాష్ట్ర, జిల్లా రోడ్లలో కేవలం గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల స్పీడ్‌తో మాత్రమే పయనించాలి. కానీ వీటి పరిమితి మించి వెళుతున్నవారే ఎక్కువ.

బస్సుల రిజిస్ట్రేషన్ అంతా ఈశాన్య రాష్ట్రాల్లోనే..

ఏపీ ప్రాంతాల్లోని బస్సులు కూడా ఏపీ ప్రభుత్వ అదుపులో లేకపోవడం గమనార్హం. 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం కేంద్ర ఒత్తిడికి లొంగడం వల్ల ప్రైవేట్ బస్సుల రిజిస్ట్రేషన్లు కూడా ఏపీలో జరగని పరిస్థితి ఏర్పడింది. ఈశాన్య రాష్ట్రాల్లో రోడ్డు టాక్స్ తక్కువ ఉందనే కారణంతో ఏపీలో నడిచే బస్సులన్నీ నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలతోపాటు, పుదుచ్చేరి, యానాం ప్రాంతాల్లోనూ జరుగుతున్నాయి. 2021 నుంచి ఇప్పటివరకూ అనేక కొత్త ట్రావెల్స్ రోడెక్కినప్పటికీ ఒక్కటి కూడా ఏపీ రవాణాశాఖ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ కాలేదు. దీనివల్ల ఏపీకి వచ్చే ఆదాయం కూడా పోతోంది. కానీ నడిచేది, వ్యాపారం చేసుకునేది మాత్రం రాష్ట్రంలోనే. అసలు మన రాష్ట్రంలో ఎన్ని ప్రైవేట్ బస్సులు తిరుగుతున్నాయనే లెక్కలు కూడా మన వద్ద లేని పరిస్థితి ఉంది. బస్సు ఓనర్ ఎవరో కూడా పూర్తి వివరాలు లేని పరిస్థితి. దీంతో ఈ బస్సులను పనికట్టుకుని తనిఖీ చేసే బాధ్యత కూడా ఎవరూ తీసుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితేనే సమస్య బయటకు వస్తుంది. అధికారులూ కదులుతున్నారు.

ఇసుక ఇక్కట్లు

- టెండర్లు ఖరారు చేసి రెండు నెలలైనా ప్రారంభం కాని స్టాక్ యార్డులు
- పెద్దాపురం, పిఠాపురం మండలం చిత్రాడ, కరప మండలం ఉప్పలంకలో స్టాక్ యార్డులు
- మూడు చోట్ల అమ్మకాలు నిల్

కలెక్టరేట్(కాకినాడ),జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు ఇసుకకోసం ఇక్కట్లు తప్పడం లేదు. ఇసుక అందుబాటులో ఉంచాలని మూడు ఇసుక స్టాక్ యార్డులను ప్రారంభించినప్పటికీ అమ్మకాలు ప్రారంభంకాలేదు. స్టాక్ యార్డుల టెండర్లు ఖరారై రెండునెలలు కావస్తున్నా ఇసుక అమ్మకాలు జరగడం లేదు. దీంతో ఇసుక కోసం జిల్లావాసులు సుదూరంలో ఉన్న రీచ్‌లకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రవాణా భారంగా మారింది.

కాకినాడ జిల్లాలో ఇసుక అందుబాటులోకి తీసుకురావడానికి గతేడాది నవంబరు 22న టెండర్లు ఖరారు చేశారు. దీంతో పెద్దాపురం నియోజవర్గానికి పెద్దాపురంలో పిఠాపురం నియోజకవర్గానికి గొల్లప్రోలులో, కాకినాడ రూరల్ నియోజకవర్గానికి కరప మండలం ఉప్పలంకలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గొల్లప్రోలులో స్టాక్ యార్డు ఏర్పాటుకు అనుకూలంగా లేకపోవడంతో చిత్రాడలో స్టాక్ యార్డు ఏర్పాటు చేశారు. వీరికి ఇసుక సరఫరా చేయడానికి కడియం మండలం వేమగిరి ఇసుక రీచ్, పెరవలి మండలం, తీపర్రు-3 రీచ్‌లను కేటాయించారు. టన్ను ఇసుక రూ.87కు ఇవ్వడం సాధ్యం కాదని కనీసం రూ.200 ఇవ్వాలని రీచ్‌ల పాటదారులు స్టాక్ యార్డు దారులను కోరారు. ఈ నేపథ్యంలో రీచ్‌దారులకు స్టాక్ యార్డు నిర్వాహకులకు మధ్య కొంత వివాదం తలెత్తింది. ఈ వివాదాన్ని జిల్లా కలెక్టర్ సమక్షంలో పరిష్కారం అయినట్లు చెబుతున్నారు. తర్వాత వివిధ కారణాలవల్ల వేమగిరి రీచ్‌ను అధికారులు సీజ్ చేశారు. దీంతో కాకినాడ జిల్లాలో స్టాక్ యార్డులకు సరఫరా కావాల్సిన ఇసుక బంద్ అయ్యింది. సరిపడేంత ఇసుక నిల్వలు స్టాక్ యార్డుల్లో లేకపోవడంవల్ల అమ్మకాలు ప్రారంభించలేదు.

కొత్తగా కాటావరం రీచ్ కేటాయింపు

తీపర్రు రీచ్‌లో ఇసుక మెత్తగా ఉండడంతో స్టాక్ యార్డుల నిర్వాహకులు ఆ ఇసుక తెచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో భవనాలు తీపర్రు ఇసుక పనికిరాదనే వాదన ఉంది. దీంతో పెద్దాపురం స్టాక్ యార్డుకు కొత్తగా తూర్పు గోదావరి జిల్లా కాటవరం ఇసుకరీచ్‌ను కేటాయించారు. ఈ రీచ్‌నుంచి పెద్దాపురం స్టాక్ యార్డుతోపాటు ప్రభుత్వ గృహ పథకంలో ఇళ్ల నిర్మాణాలకు ఇసుక సరఫరా కానుంది.

వాటికి కపిలేశ్వరపురం రీచ్

కరప మండలం ఉప్పలంక పిఠాపురం మండలం చిత్రాడ స్టాక్ యార్డులకు ఇసుక సరఫరా చేసే వేమగిరి రీచ్‌ను అధికారులు సీజ్ చేశారు. దీంతో వీరికి కపిలేశ్వపురం రీచ్ కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇసుక కోసం అగచాట్లు

జిల్లాలో మూడు ఇసుక స్టాక్ యార్డులు అమ్మకాలు ప్రారంభించకపోవడంవల్ల ఇసుక కోసం జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు. సుదూరంలో ఉన్న తూర్పుగోదావరి జిల్లా కోనసీమ జిల్లాలో ఉన్న రీచ్‌ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రయాణ సమయం అధికం అవ్వడంతోపాటు రవాణా చార్జీలు భారంగా మారాయనే ఆవేదన చెందుతున్నారు.

మరోవారంలో అందుబాటులోకి..: -జేసీ రాహుల్‌మీనా

జిల్లాలో మూడు ఇసుక స్టాక్ యార్డులలో మరో వారంరోజుల్లో ఇసుక విక్రయాలు ప్రారంభమవుతాయి. ప్రస్తుతానికి కరప మండలం ఉప్పలంక యార్డులో వెయ్యి టన్నులు ఇసుక ఉంది. పెద్దాపురం యార్డులో 200 టన్నులు, చిత్రాడ యార్డులో 200 టన్నులు ఇసుక సిద్ధంగా ఉంది. రీచ్‌ల నుంచి రెగ్యులర్‌గా సరఫరా ప్రారంభమైన తర్వాతే ఈయార్డుల్లో ఇసుక అమ్మకాలు ప్రారంభమవుతాయి. జిల్లా వాసులకు ఇసుక అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలు

ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కరప మండలం ఉప్పలంకలో, పెద్దాపురం ఇసుక స్టాక్ యార్డులో టన్ను రూ.600కే విక్రయించాలి. పిఠాపురం మండలం చిత్రాడ స్టాక్ యార్డులో టన్ను రూ.582కే ఇవ్వాలి.

ఘనంగా మంత్రి లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు



మంత్రి లోకేశ్ పుట్టినరోజు వేడుకలు జిల్లావ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న సిటీ ఎమ్మెల్యే వనమాడి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, ఎమ్మెల్సీ చిరంజీవి, సీనియర్ నేతలు చిక్కాల, పిల్లి సత్తిబాబు, అనంతలక్ష్మి తదితరులు

ఉత్తమ ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్



- కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర, మరో ఇద్దరు బీఎల్‌వోలు కూడా..

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను ఎంపిక చేస్తూ రాష్ట్ర ఎన్నికలసంఘం ఉత్తర్వులు వెలువరించింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు జిల్లా ఎన్నికల అధికారగా ఆయన సమర్థవంతంగా సేవలు అందించారు. చిత్తూరు జిల్లాలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి వివాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. దీంతో చిత్తూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు-2024 ప్రశాంతంగా జరిగాయి. ఈ నేపథ్యంలో ఈయన్ను జిల్లా ఉత్తమ ఎన్నికలు అధి కారిగా ఎన్నికల సంఘం ప్రకటించింది.

అదనపు ఎన్నికల అధికారిగా..

సార్వత్రిక ఎన్నికల్లో అదనపు ఎన్నికల అధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబును ఉత్తమ ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

దెందులూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్రను ఉత్తమ ఎన్నికల అధికారిగా ఎన్నికల సంఘం ప్రకటించారు.

మరో ఇద్దరికి..

జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన ఎన్.మహాలక్ష్మి, డి.రాజ్యలక్ష్మి ఎన్నికల్లో బీఎల్‌వోలుగా ఉత్తమ సేవలు అందించినందుకు ఉత్తమ ఎన్నికల అధికారిణిలుగా అవార్డు లభించింది. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ తమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో వీరు అవార్డులు అందుకుంటారు.

పిఠాపురంలో జిల్లాస్థాయి చేతిరాత పోటీలు



చేతిరాత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పిఠాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి చేతిరాత పోటీలు గురువారం నిర్వహించారు. మూడు నుంచి పదో తరగతి వరకూ గల విద్యార్థులకు మూడు విభాగాలుగా ఈ పోటీలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి 500మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్, జిల్లా ఉపవిద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు పరిశీలించారు. విద్యార్థుల్లో చేతిరాత నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ పోటీల్లో సబ్‌జూనియర్స్ విభాగంలో బి.వెంకట్(ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పిఠాపురం) ప్రథమస్థానంలో నిలవగా, ఎ.శశికళ(జడ్పీహెచ్ఎస్, మల్లాం), కె.మహాలక్ష్మి(మునిసిపల్ ఉన్నత పాఠశాల, సామర్లకోట), జ్యోతి కమల(మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ధర్మవరం) ద్వితీయ, తృతయ, చతుర్థ స్థానాల్లో నిలవగా, జూనియర్స్ విభాగంలో ఎస్.జ్యోతిష(జడ్పీహెచ్ఎస్, తాళ్లరేవు), ఈ. అచ్చారత్నం(శంఖవరం), పి.సత్యశ్రావణి(పి.దొంతమూరు), వి.లక్ష్మీగంగాదుర్గ(మల్లాం), సీనియర్స్ విభాగంలో ఎం.నాగాంజలి(మునిసిపల్ బాలికోన్నత పాఠశాల, పిఠాపురం), కె.సంధ్యారాణి(జడ్పీహెచ్ఎస్, పి.దొంతమూరు), మౌనికసాయి(తుని), లిప్సిక(సామర్లకోట) మొదటి నాలుగు స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస వినీల్, జిల్లా చేతిరాత కోఆర్డినేటర్ అబ్రహం హన్స్, ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్. యహీయా, విద్యాకమిటీ చైర్మన్ పల్లా లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడ కలెక్టరేట్‌కు.. లారీల కిరాయి పంచాయితీ

- లారీ యూనియన్, కాకినాడ సీపోర్టు ప్రతినిధులతో చర్చించిన కలెక్టర్ షాన్‌మోహన్
- 15 ఏళ్లుగా యూనియన్ లారీలే బొగ్గు రవాణాకు ఉపయోగిస్తున్నామన్న యూనియన్ ప్రతినిధులు
- సయోధ్యకు యత్నించిన కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టు లిమిటెడ్ (కేఎస్‌పీఎల్) అద్దె లారీల కిరాయి పంచాయితీ కాకినాడ కలెక్టరేట్‌కు చేరింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ షాన్‌మోహన్ సీపోర్టు ప్రతినిధులు, కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇరువర్గాల నుంచి విడివిడిగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమావేశానికి హాజరైన కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ 15ఏళ్లుగా కాకినాడనుంచి విశాఖ సమీపంలోని తాళ్లపూడి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేస్తున్నామని పేర్కొన్నాడు. లారీ యూనియన్‌నుంచి అద్దెకు తీసుకున్న కేఎస్‌పీఎల్‌కు 20 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు చెప్పాడు. టన్ను బొగ్గు తాళ్లపూడికి రూ.961 కాగా, దీనిలో 20 శాతం డిస్కౌంట్ ఇచ్చి లారీలు పంపిస్తున్నామన్నారు. ప్రధానంగా కాకినాడ లారీ యూనియన్‌పై వేలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నా యని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సీపోర్టు లిమిటెడ్ ప్రతినిధులు మాట్లాడుతూ తమకు ఎక్కడైతే తక్కువకు కిరాయి లారీలు వస్తాయో.. అక్కడ నుంచే తీసుకుంటా మన్నారు. అద్దె తక్కువగా తీసుకుని బొగ్గు రవాణా చేస్తే అభ్యంతరం లేదన్నారు. లారీల కిరాయి విషయంలో ఇరువర్గాలు ఒక అభిప్రాయానికి రాకపోవడంతో మరో పర్యాయం సమావేశం కానున్నారు.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్‌లో సమావేశం

ఈ విషయమై శుక్రవారం కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో రాజకీయ ప్రతినిధులు, లారీ యూనియన్ నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, సీపోర్టు ప్రతినిధులు సమావేశం కానున్నారు.

27న సమావేశం

కలెక్టరేట్‌లో ఈనెల 27వ తేదీన కాకినాడ లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ , కాకినాడ పోర్టు , పరిశ్రమల ప్రతినిధులు ట్యాంకర్స్ అద్దె విషయమై కలెక్టర్ సమక్షంలో చర్చించనున్నారు.



కాకినాడలో ఓ దుకాణంలో సామగ్రి

ఇప్పుడంతా సెకండ్ సేల్‌దే హవా

పాత ఫర్నీచర్‌కు పెరుగుతున్న గిరాకీ

కాకినాడలో పలు షాపులు

తక్కువ రేట్లకు సామగ్రి వస్తుండడంతో

మధ్యతరగతి ప్రజల ఆసక్తి..

ఒకప్పుడు పాత సామాన్లు కొంటామంటూ పలువురు చిల్లర వ్యాపారస్తులు నగరాలు, పట్టణాలు, పల్లెల్లో రోడ్లపై తారసపడేవారు. వారికి మన ఇంట్లో ఉపయోగ పడని వస్తువులను ఎంతో కొంతకి అమ్మేసేవాళ్లం. కొనుగోలు చేసిన వాటిని వారు వేరే దుకాణంలో అమ్ముకునే వారు. ఇప్పుడు ఆ చిల్లర వ్యాపారం రోడ్లపై కనిపించడంలేదు. అది కాస్తా ఓ మెగా వ్యాపారంగా రూపాంతరం చెందింది. ఈ తరహా పాత సామాన్లు అమ్మే దుకాణాలు కాకినాడ మెయిన్‌రోడ్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా ఉండేవి. ప్రస్తుతం నగరంలో విరివిగా ఈ దుకాణాలు ఏర్పాటు చేశారు.

సెకండ్స్ మార్కెట్

ఇచ్చట దొరుకుతాయి అన్నీ చవకగా..



పాత సోఫా సెట్లు

కార్పొరేషన్ (కాకినాడ), (ఆంధ్రజ్యోతి):



మధ్య తరగతికి ఆసరా

ప్రస్తుత పరిస్థితుల్లో ఆకాశాన్ని అంటుతున్న ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు చూసి మధ్య తరగతి జీవుడు వాటి జోలికి వెళ్లడం లేదు. ఇటువంటి వారికోసం 2001లో కాకినాడలో పాత వస్తువులు అమ్మకాలు, కొనుగోళ్ల దుకాణాలు వెలిశాయి. వీటి ఏర్పాటుతో మధ్య తరగతి వారికి ఆసరా లభించినట్లయింది. ఎక్కువ రేట్లు పెట్టి ఇంట్లో సామగ్రిని కొనలేని వారు చాలా మంది ఉంటారు. వారికి ఈ షాపులు చాలా బాగా ఉపయోగపడుతున్నాయి.. దీంతో వాటికి ఆదరణ పెరుగుతోంది..

దొరికే వస్తువులివి..

పాత ఫర్నీచర్ దుకాణాల్లో కుర్చీలు, డబుల్ కాట్ మంచాలు, డైనింగ్ టేబుళ్లు, దివానా కాట్లు, టీవీలు, వాషింగ్ మెషిన్లు, ఫ్రిజ్లు, మహారాజా కుర్చీలు, బీరువాలు, బల్లలు, ఇలా ఒకటేమిటి బెడ్‌రూమ్ నుంచి వంట గదిలో పెట్టుకునే వస్తువుల వరకు సరసమైన ధరలకు ఇక్కడ దొరుకుతాయి. సాయంత్రం ఆరు నుంచి ఈ దుకాణాలు కిటకిటలాడతాయి.

రూ.1500కే టీపాయ్

టీపాయ్‌లు సైజులను బట్టి కొత్తవి రూ.2,500 నుంచి రూ.10వేల వరకు ఉంటాయి. ఈ షాపుల్లో రూ.1500 నుంచి రూ.3 వేల లోపు దొరుకుతున్నాయి.సింగిల్ కాట్ మంచాలు కొత్త వాటి ధర రూ.7 వేల నుంచి రూ.15 వేల వరకు ధరల్లో ఉంటాయి. కానీ ఇక్కడ రూ.5వేల నుంచి రూ.7 వేల వరకు లభ్యమవుతున్నాయి.టీవీలు, వాషింగ్ మిషన్లు, వివిధ రకాల గృహోపకరణ వస్తువులు కొత్తవాటి ధరల్లో సగానికి పైగా తక్కువ ధరకు ఈ షాపుల్లో విక్రయిస్తున్నారు.

టేకు వస్తువులు..

గతంలో టేకు కర్రతో తయారు చేసిన వస్తువులు కాస్త అందుబాటు ధరల్లో వచ్చేవి. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్యులు కొనుక్కోలేని విధంగా ధరలు పెరిగాయి. గతంలో టేకుతో చేయించుకున్న పాత ఫర్నీచర్ సామాన్యులకు సెకండ్ హ్యాండ్ దుకాణాల్లో అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి.

కొత్త వాటితో పోలిస్తే..

మార్కెట్‌లో కొత్త ఐరన్ బీరువా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు మోడల్‌ను బట్టి ధర ఉంటుంది. ఇదే సెకండ్ హ్యాండ్ దుకాణాల్లో రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంటుంది.ఫ్రిజ్ కొత్తది రూ.15 వేలు నుంచి రూ.30 వేలు, రూ.50 వేలు, లక్ష రూపాయిల వరకు ఉంటే ఇక్కడ పాతవి మోడల్ బట్టి సైజును బట్టి రూ.6 వేల నుంచి లభ్యమవుతాయి.





భలే మంచు రోజు

కాకినాడ జిల్లా తుని వద్ద జాతీయ రహదారిపై మంచు కురుస్తున్న దృశ్యం





కాకినాడ జిల్లా తుని వద్ద జాతీయ రహదారిని మంచు దుప్పటి కప్పేసింది.. ఆ దృశ్యాలు మనోహరంగా కనిపించాయి. పొద్దు పొడిచే వేళ ఈ సుందర దృశ్యాలు వాహనదారులను ఆకట్టుకున్నాయి. గత నాలుగు రోజులుగా మంచు తీవ్రత ఎక్కువగా ఉంది. ఉదయం తొమ్మిది అవుతున్నా మంచు తెరలు అలానే ఉంటున్నాయి. జాతీయ రహదారితో పాటుగా గ్రామీణ రోడ్లలో వాహనదారులు, బాటసారులు లైట్ల వెలుగుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. మెట్టలో మంచు అందాలను ఆస్వాదిస్తూ జాతీయ రహదారిపై వాహనదారులు సెల్ఫీలు దిగుతున్నారు...

● తుని రూరల్(ఆంధ్రజ్యోతి):

తుని రూరల్ మండలంలో ఉదయం తొమ్మిది గంటలకు మంచు తెరలు



వివేకానందుడి రచనలు ఆదర్శం

- సీబీఐ పూర్వపు జేడీ వీవీ లక్ష్మీనారాయణ
- అనపర్తి శ్రీరామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో జయంత్యుత్సవాలు
- నలుగురికి జీవన సాఫల్య పురస్కారాలు

అనపర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సమాజానికి స్వామి వివేకానందుడి రచనలు ఆదర్శనీయమని, దీన్ని ప్రతిఒక్కరూ ఆచరించాలని సీబీఐ పూర్వపు జేడీ వీవీ లక్ష్మీనారాయణ కొనియాడారు. అనపర్తిలోని శ్రీరామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం వివేకానందుని జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక వివేకానంద సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గాల్లోకి బెలూన్లు వదిలిపెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తర్వాత దుప్పలపూడిలోని ఆర్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగినన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందుని భావజాలాన్ని అలవరచుకోవాలని సూచించారు. స్వామి పురస్కార గ్రహీత, ఆధ్యాత్మికవేత్త రాధా మనోహర దాస్ మాట్లాడుతూ వివేకానందుడి చికాగాలోని ప్రసంగం దేశ, విదేశాలలో ఆయనకు కీర్తి ప్రతిష్ఠలు తెచ్చి పెట్టాయన్నారు. జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ లక్ష్యం ఎంతో అవసరమన్నారు.

మరో పురస్కార గ్రహీత మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ మాతృభాషపై ప్రతి ఒక్కరూ ప్రేమను కలిగి ఉండాలన్నారు. అనంతరం పురస్కార గ్రహీత, చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, మరో పురస్కార గ్రహీత ఏపీ నీటిపారుదల శాఖ సలహాదారు నాగినేని కన్నయ్య నాయుడు మాట్లాడారు. తర్వాత వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలకు ఎంపికైన మండలి బుద్ధ ప్రసాద్, సీఎస్ రంగరాజన్, నాగినేని కన్నయ్య నాయుడుకు స్వామి వివేకానంద ఎక్సలెన్సీ అవార్డుకు ఎంపికైన రాధా మనోహర దాస్‌కు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, రాజమండ్రి రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ చేతుల మీదుగా అందజేశారు. దీనిలో భాగంగా ఒక్కొక్కరికీ రూ. 25 వేల నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు సబ్బెళ్ల అమ్మిరెడ్డి, మేడపాటి రామలింగారెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం. దుర్గాప్రసాద్, సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




అనపర్తిలో గాల్లోకి బెలూన్లు వదలి వివేకానందుడి జయంత్యుత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



దుప్పలపూడిలో పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం





జేఎన్‌టీయూకే ఆవరణలో చేతిరాతలో పాల్గొన్న విద్యార్థులు


‘ఆదిత్య’ విద్యార్థుల హ్యాండ్ రైటింగ్ మారథాన్

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు
- ఐదు నిమిషాల వ్యవధిలో నేతాజీ జీవిత చరిత్రను కర్సీవ్ చేతిరాతతో రాసిన విద్యార్థులు



ట్రోఫీ, ధ్రువీకరణ పత్రాన్ని డైరెక్టర్ శృతిరెడ్డికి అందజేస్తున్న ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు

జేఎన్టీయూకే, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ప్రాంగణంలో అలూమ్ని ఆడిటోరియం లాన్‌లో గురువారం 2,200 మంది ఆదిత్య విద్యార్థులతో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి, జాతీయ చేతిరాత దినోత్సవాన్ని పురస్కరించుకుని నేతాజీ జీవితచరిత్రను విద్యార్థులు ఐదు నిమిషాల వ్యవధిలో కర్సీవ్ చేతిరాతతో రాశారు. ఈ కార్యక్రమానికి ఆదిత్య డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి అధ్యక్షత వహించగా ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి సమక్షంలో ఇండియాబుక్‌ఆఫ్‌రికార్డ్స్ ఎగ్జిక్యూటివ్ దిలీప్ పాత్రో, సద్గురు అకాడమీ ఛైర్మన్ మహాలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా 3వ అదనపు జిల్లా జడ్జి పి.కమలా దేవి, ముఖ్యఅతిథిగాను ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ గౌరవ అతిథిగాను, గాయకులు కె.యశస్వి ప్రత్యేక అతిథిగాను పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శేషారెడ్డి మాట్లాడుతూ నేతాజీ వంటి మహనీయుని జీవిత చరిత్రను విద్యార్థులు కలిసి రాయడం చాలాగొప్ప విషయమన్నారు. జడ్జి కమలాదేవి మాట్లాడుతూ విద్యార్థులు చక్కని చేతిరాతతో అద్భుతమైన నైపుణ్యాభివృద్ధిని సాధించారన్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమానికి జేఎన్టీయూకే వేదిక కావడం తమకు గర్వంగా ఉందన్నారు. దిలీప్‌పాత్రో విద్యార్థుల అద్భుతమైన చేతిరాత నైపుణ్యం దృష్ట్యా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించినట్లు ప్రకటించారు. అనంతరం సంబంధిత పతకం, ట్రోఫీ, ప్రతిభాపత్రాలను డైరెక్టర్ శృతిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసా పత్రాలను ప్రదానం చేయగా విద్యార్థులు జాతీయ పతాకం ఆకారంలో వివిధ రంగుల దుస్తులతో కూర్చుని చేతిరాత మారథాన్‌లో పాల్గొనడం అందరినీ ఆకర్షించింది. కార్యక్రమంలో ఆదిత్య గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, వైస్‌ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయపతాకం ఆకారంలో రంగుల దుస్తులతో కూర్చున్న విద్యార్థులు



రెండో రోజు జేఈఈ మెయిన్స్ పరీక్షకు 1178 మంది హాజరు

● రెండు కేంద్రాల్లో .. రెండు సెషన్లలో నిర్వహణ

కాకినాడ రూరల్, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ పరీక్షలు రెండోరోజైన గురువారం కాకినాడలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక అచ్యుతాపురం రైల్వే గేటు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్, రూరల్‌లోని రాయుడుపాలెంలో గల సాఫ్ట్ టెక్నాలజీస్‌లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. మొత్తం 1211 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1178 మంది మాత్రమే హాజరైనట్టు కేంద్రాల ప్రతినిధి తెలిపారు. 33 మంది పరీక్షకు రాలేదన్నారు. శుక్రవారం కూడా పరీక్షలు కొనసాగతాయన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 22,500 మినీ గోకులాలు

- ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రత్యేక అధికారి డాక్టర్ రాధాకృష్ణమూర్తి



లేగదూడలను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రాధాకృష్ణమూర్తి

పి.గన్నవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 22,500 మినీ గోకులాలు మంజూరు చేశామని పశు ఆరోగ్య శిబిరాల ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రత్యేక అధికారి డాక్టర్ కె.రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఇప్పటి వరకు 75 శాతం షెడ్ల పూర్తయ్యాయని, మిగిలినవి కూడా త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంకలో గురువారం ఏర్పాటు చేసిన పశుఆరోగ్య శిబిరం, లేగ దూడల ప్రదర్శన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2.50 కోట్లతో పశుబీమా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 62,500 పశువుల వరకు బీమా చేయించుకోవచ్చునని తెలిపారు. రైతు రూ. 400 చెల్లిస్తే ప్రభుత్వం రూ. 700 చెల్లించి పశువుకు బీమా చేస్తుందని తెలిపారు. 50 సెంట్ల భూమి కలిగిన ప్రతి పాడి రైతుకు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాసం కోసం రూ.32,500 అందిస్తున్నామని తెలిపారు. ఉప సంచాలకుడు డాక్టర్ కె.మూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా శైలజ్ (పశుగ్రాసం)కు సంబంధించి ఐదు యూనిట్లు మంజూరయ్యాయని, గ్రూపులుగా ఏర్పడి చేసుకుంటే పశుగ్రాసానికి కొరత ఉండదన్నారు. సహాయ సంచా లకుడు డాక్టర్ ఎల్.విజయరెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలలకొకసారి నులి పురుగు మందులు ఇవ్వాలని, తద్వారా కొన్ని వ్యాధులు నివారించవచ్చునని తెలిపారు. అనంతరం లేగదూడల ప్రదర్శనలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన పాడి రైతులకు బహుమతులను అందజేశారు. సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, డీఎల్‌డీఏ డాక్టర్ కళ్యాణి, పశువైద్యాధికారులు పి.కిరణ్ చైతన్య, డాక్టర్ డి.మాధురి, సిబ్బంది రాజు, నాయకులు, పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మాధవాయిపాలెం రేవు పాట ప్రారంభ ధర రూ.3.13 కోట్లు

నరసాపురం రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవు పాట ప్రారంభ ధర రూ.3.13 కోట్లుగా జాయింట్ యాక్షన్ కమిటీ నిర్ణయించింది. గురువారం మండల పరిషత్ కార్యా లయంలో ఎంపీపీ సోని అధ్యక్షతన సమావేశమైన కమిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పాట ప్రారంభ ధరపై చర్చించింది. మూడేళ్ల ఆదాయాన్ని సగటు కట్టి ప్రారంభధరను నిర్ణయించినట్లు ఎంపీ డీవో రామకృష్ణంరాజు కమిటీకి తెలిపారు. దీనిని జిల్లా అధికారులకు నివేదించి, అనుమతి రాగానే నోటిఫికేషన్ ఇచ్చి మార్చిలో వేలం నిర్వహించాలని తీర్మానించారు. ఎంపీపీ మల్లికార్జున్, జెడ్పీటీసీ రాధకృష్ణ, ఈవోపీఆర్డీ నాగేంద్ర, సూపరింటెండెంట్ వీరభద్రరావు, సిబ్బంది సురేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఘోర ప్రమాదం





రాజమహేంద్రవరం సమీపంలోని గామన్ బ్రిడ్జి రోడ్డులో కాతేరు దగ్గర అర్ధరాత్రి బోల్తాకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సును క్రేన్ సాయంతో రోడ్డు పక్కన నిలబెట్టిన దృశ్యం, బస్సునుంచి చెల్లాచెదురుగా పడిన బెడ్లు, సీట్లు

- గామన్ బ్రిడ్జి రోడ్డులో కాతేరు వద్ద కావేరీ ట్రావెల్స్ బస్సు బోల్తా
- యువతి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు.. 17మందికి గాయాలు
- డైవర్షన్ చూసి రాంగ్ రూటులోకి వెళ్లిన బస్సు.. ఎదురుగా వచ్చిన స్కూటీ
- పల్టీకొట్టి 200మీటర్లు రోడ్డుపై దూసుకుపోయిన బస్సు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు-కాతేరు మధ్యలో గామన్ బ్రిడ్జి రోడ్డులో గురువారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో కావేరి ట్రావెల్స్ బస్సు రాంగ్ రూట్‌లోకి వెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో విశాఖపట్నం మద్దెలపాలేనికి చెందిన కోనా హోమిని కళ్యాణి(21) అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, 17మందికి కాళ్లు, చేతులు విరిగాయి. గాయపడిన వారంతా విశాఖపట్నానికి చెందిన యువతే. వీరంతా ఉద్యోగాల ఇంటర్వ్యూల కోసం హైదరాబాద్ బయలుదేరినట్టు చెబుతున్నారు.

బస్సు కింద నలిగిపోయి..

ప్రమాద సమయంలో బస్సు బోల్తా కొట్టి రోడ్డును ఈడ్చుకుంటూ వెళ్తున్న సమయంలో బస్సులో ఉన్న యువతి హోమిని కళ్యాణి బయటపడిపోయి బస్సు కింద నలిగి మరణించింది. ఆమె స్నేహితురాలు విశాఖపట్నానికి చెందిన దీక్షితకు తుంటి ఎముకు విరిగిపోయి తీవ్రంగా గాయపడింది. కాగా, మృతురాలు కల్యాణి విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలతో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగానికి ఎంపికై హైదరాబాద్ వెళ్తున్నట్టు సమాచారం.

ప్రమాదం జరిగిందిలా..

బుధవారం రాత్రి పది గంట సమయంలో విశాఖపట్నంలో కావేరి ట్రావెల్స్ బస్సు బయలు దేరింది. అన్నవరంవద్ద కొంతమందిని ఎక్కించుకున్నారు. అర్ధరాత్రి 12:30 గంటల సమయం దాటేసరికి తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జీరో పాయింట్ నుంచి గామన్ బ్రిడ్జి రోడ్డులోకి మళ్లింది. వేగంగా వస్తున్న బస్సు కొంతమూరు దాటి కాతేరు గ్రామ పరిధిలో గామన్ రోడ్డులోకి వచ్చేసరికి యాంటీ వేలోకి ప్రవేశించే క్రమంలో మలుపు తిప్పుతుండగా ఎదురుగా ఒక స్కూటీ వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో డ్రైవర్ బస్సును ఎడమ వైపునకు మళ్లించడంతో డివైడర్ పైకి బస్సు ఎడమ వైపు టైర్ ఎక్కింది. దీంతో బస్సు గాలిలో లేచి బోల్తా కొట్టి 200 మీటర్లు దూసుకుపోయినట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో బెడ్‌లు, సీట్లు తునాతునకలై బయటకు వచ్చేశాయి. లోపలనుంచి ఆర్తనాదాలు వినిపించడంతో స్థానికులు స్పందించి సెల్ ఫోన్ల లైట్ల వెలుగులో బస్సు వెనుక అత్యవసర ద్వారాన్ని పగులగొట్టి బయటకు తీశారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. త్రీటౌన్ సీఐ అప్పారావు, పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కోనా హోమిని కళ్యాణి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఈ సంఘటన జరిగినప్పుడు డ్రైవింగ్‌లో ఉన్న డ్రైవర్ మల్లేశ్వరరావు కొద్దిగా మద్యం సేవించినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అతడు పరారీలో ఉన్నాడు. రెండో డ్రైవర్ గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ప్రమాదానికి కారణం.. ఆ నిర్లక్ష్యమేనా?

గామన్‌రోడ్డులో బస్సు బోల్తా ఘటనకు పాత్ సంస్థ వారే కారణమనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఆ రోడ్డు నిర్వహణ బాధ్యతలు తీసుకున్న పాత్ సంస్థ రహదారి మరమ్మతులు చేపట్టింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో బుధవారం జంక్షన్ వద్ద రోడ్డు డైవర్షన్ బోర్డు పెట్టి.. డివైడింగ్ ఫైబర్ ఇండికేటర్స్ పెట్టి పనిపూర్తయినా వాటిని తొలగించలేదు. దీంతో బస్సు డ్రైవర్ రోడ్డు డైవర్షన్ చూసి కంట్రోల్ చేసి మలుపుతిప్పే క్రమంలో బస్సు బోల్తా కొట్టినట్టు స్థానికులు చెప్తున్నారు. ఇదే రోడ్డులో 500 మీటర్ల దూరంలో ఆగిఉన్న లారీని మరో లారీ ఢీకొట్టింది. ఇది కూడా అర్ధరాత్రే జరిగింది. రవాణాఅధికారులు పరిస్థితిని పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

చిన్నకుమార్తె దుర్మరణంతో తల్లడిల్లిన తల్లి హృదయం

- విశాఖ యువతి దుర్మరణంతో పెద్ద కుమార్తెను పట్టుకుని తల్లి రోదన
- జీజీహెచ్‌లో పోస్టుమార్టం .. కుటుంబీకులకు అప్పగింత

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గామన్ బ్రిడ్జిపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడిన సంఘటనలో చిన్నకుమార్తె దుర్మరణం పాలవడంతో పెద్దకుమార్తెను పట్టుకుని తల్లి కోన లక్ష్మి రోదిస్తున్న తీరు అక్కడున్న వారిని కలచివేసింది. మరోపక్క తండ్రి రాఘవదాసు తన దుఃఖాన్ని గుండెల్లోనే అణచుకుని బాధను దిగమింగుకోవడం ఆవేదన కలిగించింది. రాజమహేంద్రవరం జీజీహెచ్ పోలీస్ అవుట్‌పోస్టు వద్ద గురువారం ఈ హృదయ విదారకమైన దృశ్యం కళ్ల చెమర్చేలా చేసింది. గామన్ బ్రిడ్జిపై బుధవారం అర్ధరాత్రి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన సంఘటనలో కోన హోమినీ కల్యాణి(21) దుర్మరణం చెందింది. కల్యాణి తండ్రి రాఘవదాసు విశాఖపట్నం రైల్వేలో ఉద్యోగం చేస్తుండగా వీరు మద్రిపాలెంలో నివాసం ఉంటారు. రాఘవదాసుకు ఇద్దరు కుమార్తెలు కాగా వారిలో చిన్న కుమార్తె మృతురాలు కల్యాణి. ఆమె విశాఖ విజ్ఞాన్ విద్యాసంస్థల్లో బీటెక్ ఫైనలియర్ చదువుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్ వెళ్తూ ప్రమాదానికి గురై మరణించింది. కాగా జిల్లా రవాణా అధికారి సురేష్ జీజీహెచ్‌లో క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదానికి సంబంధించి ప్రాథమిక నివేదికను కలెక్టర్‌కు అందించామని వెల్లడించారు.

● జీజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద దుర్ఘటనలో కొంతమందికి కాళ్లు, చేతులు విరిగాయి. వీరికి రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో చికిత్స అందించారు. నెల్లిమర్లకు చెందిన సంతోష్, గాజువాకకు చెందిన కె.ఫాతిమాబేగం, తునికి చెందిన పి.రాజ్యలక్ష్మి, అన్నవరానికి చెందిన కె.దేవిలకు ఫ్రాక్చర్లు అయ్యాయి. ఆర్థోపెడిక్ విభాగంలో వీళ్లకు కట్లు కట్టి వార్డుకు తరలించారు. కుటుంబసభ్యులు రావడంతో వీరిలో తెల్లవారుజామున కొందరు, ఉదయం మరికొందరు సొంతూళ్లకు వెళ్లిపోయారు.



రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు




విలపిస్తున్న మృతురాలు కల్యాణి తండ్రి, బంధువులు

జీజీహెచ్‌లో చికిత్స

జీజీహెచ్(కాకినాడ), జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్ నుంచి గురువారం తెల్లవారు జామున కాకినాడ జీజీహెచ్‌కు తరలించిన క్షతగాత్రులకు ప్రత్యేక చికిత్స అందుతోంది. వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం శివారులో బుధవారం అర్ధరాత్రి ట్రావెల్స్ బస్సు తిరగబడ్డ ఘటనలో తీవ్ర గాయాల పాలైన శ్రీకాకుళానికి చెందిన చెల్లూరి కోటేశ్వరరావు, తలియ ధనలక్ష్మి, రేణుకలను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. రేణుకను ఆమె కుటుంబసభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మిగతా ఇద్దరికీ జీజీహెచ్‌లో చికిత్స చేస్తున్నారు. ఇంకా వారిని పరిశీలనలో ఉంచినట్లు జీజీహెచ్ వైద్యులు తెలిపారు.



డైవర్షన్ కోసం వినియోగించిన ఫైబర్ పరికరాలను రోడ్డు పక్కకు నెట్టివేసిన దృశ్యం

ఐదు అడుగుల కొండచిలువ హతం



కపిలేశ్వరపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మాచర కొత్తకాలనీలో భారీ కొండ చిలువను స్థానికులు గురువారం హతమార్చారు. సుమారు ఐదడుగులు పైబడి ఉండడంతో కాలనీ వాసులు బెంబేలెత్తిపోయారు. ఈ వీధిలో తుప్పలు, పొదలు, పేరుకుపోయి ఉండడం, విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో ప్రతి రోజూ విషసర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో భయం గుప్పెట్లో బతకాల్సి వస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించాలని వారంతా కోరుతున్నారు.



మాచరలో హతమార్చిన భారీ కొండచిలువ

మద్యం కేసులో.. మాజీ ఎమ్మెల్యే అనుచరుడి అరెస్టు

ఐ.పోలవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో వైసీపీ నాయకుడు, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రధాన అనుచరుడు, యానానికి చెందిన కాటంశెట్టి రామ్మూర్తిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గత ఎన్నికల సమయంలో పశువుల్లంక రొయ్యల చెరువు వద్ద భారీగా నిల్వ చేసిన మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు రామ్మూర్తిని అరెస్టు చేశారు. ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ముమ్మిడివరం కోర్టులో హాజరుపరిచారు.



బూడిదైన కోళ్ల ఫారాలు

రెండు కోళ్లఫారాలు దగ్ధం

● రూ.నాలుగు లక్షల ఆస్తినష్టం

గోకవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అచ్చుతాపురంలో గురువారం రెండు కోళ్ల ఫారాలు కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన నల్లల వెంకన్నబాబువిగా గుర్తించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని బాధితుడు వెంకన్నబాబు పేర్కొన్నాడు. సమీపంలో ఉన్న గుమ్మళ్ళదొడ్డి హెచ్‌పీసీఎల్ ఆయిల్ ప్లాంట్, రాజమహేంద్రవరం అగ్ని మాపక కేంద్రం నుంచి రెండు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు రూ. నాలుగు లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్టు అంచనా. ప్రభుత్వం తనను అన్నివిధాలా ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

దశ తిరిగినట్టే!

- రూ.271.43కోట్లతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ
- ప్రధాన స్టేషన్, పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌లతో అందమైన లుక్
- నిధులు మంజూరు చేసిన కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ



రాజమహేంద్రవరం నూతన రైల్వేస్టేషన్ నమూనా చిత్రం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు వాణిజ్య కేంద్ర బిందువైన రాజమహేంద్రవరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కేంద్రప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. లక్షలాదిమంది ప్రయాణికులకు సేవలందిస్తున్న రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించేందుకు రైల్వే మంత్రిత్వశాఖ రూ271.43కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రస్తుతం ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్ భవనాలను, పార్కింగ్ ప్రదేశాలను, కమర్షియల్ భవనాలను నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన బ్లూప్రింట్‌ను రైల్వేశాఖ విడుదల చేసింది.

● ఆధునికీకరణ పనులు ఇవే..

ఇందులోభాగంగా స్టేషన్ వెస్ట్ సైడ్‌లో గ్రౌండ్ ప్లస్‌త్రీ స్టేషన్ భవనాలు ప్రయాణికులకు సౌకర్యవంగా నిర్మిస్తారు. ఈస్ట్ సైడ్‌లో గ్రౌండ్ ప్లస్ 5 స్టేషన్ భవనాన్ని నిర్మిస్తారు. అందులోనే కమర్షియల్‌కు కేటాయింపులు ఉంటుంది. ప్లాట్ ఫాం అప్‌గ్రేడ్‌కు సంబంధించి పూర్తిగా సీవోపీఎస్ ఉంటుంది. 17 ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టులతో ప్రయాణికులకు సౌకర్యవంతంగా నిర్మిస్తారు. పార్కింగ్ సదుపాయాల విషయానికి వస్తే నాలుగు పార్కింగ్ ప్రదేశాలను అభివృద్ధి చేశారు. ఈ పార్కింగ్ ప్రదేశాల్లో 300కార్లు నిలుపుదల చేసేలా నిర్మాణాలు చేస్తారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నిర్మాణాలు ప్లాన్ చేశారు. రూఫ్ ప్లాజా విషయానికి వస్తే 24 మీటర్ల వైడ్, 110 మీటర్లు పొడవుగల రూఫ్ ప్లాజ్ నిర్మాణం చేసి రిటైల్ అవుట్‌లెట్స్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించేలా ప్లాన్‌ను రూపొందించారు. రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఆరుమీటర్లు వైడ్ నిర్మించి స్టేషన్ ప్లాట్‌ఫామ్ టూ అవుట్ సైడ్‌కి కనెక్ట్ చేస్తారు. భవిష్యత్తు విస్తరణలో అడిషనల్ ప్లాట్‌ఫామ్‌లు తూర్పు వైపు పెంచుతారు. మల్టీలెవల్ కార్ పార్కింగ్ కూడా నిర్మించనున్నట్లు ఎస్సీ రైల్వే డీఆర్ఎం ఎ.పాటిల్ నరేంద్ర తెలిపారు.

జలవిద్యుత్ కేంద్రం వద్ద నూతన యూనిట్ల పరిశీలన



అండర్ గ్రౌండ్ టన్నల్ పనులను పరిశీలిస్తున్న ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్

మోతుగూడెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జల విద్యుత్ కేంద్రం వద్ద కొత్తగా నిర్మించబోయే 5, 6 యూనిట్లను ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ ఎం.సుజయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ముందుగా ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు. అనంతరం కొత్తగా కట్టబోయే 5, 6 యూనిట్ల వద్దకు వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి లోటుపాట్లు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అండర్ గ్రౌండ్ టర్నల్ వర్క్, పెన్‌స్టాక్ వద్ద పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. అక్కడినుంచి ఫోర్‌బై రిజర్వాయర్, పవర్ కెనాల్, డొంకరాయి పవర్ ప్లాంట్ పవర్ కెనాల్, ఏబీపీ డ్యాం పరిశీలించారు. పరిశీలనకు వచ్చిన ఆయన్ను 5, 6 యూనిట్లు ఎప్పటికల్లా పూర్తవుతాయని విలేఖరులు అడగ్గా త్వరలో పూర్తి చేస్తామని, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో అధికారులు, ఉద్యోగులు కలిసికట్టుగా పని చేస్తున్నారన్నారు. ఆయన వెంట విజయవాడ విద్యుత్ సౌధ నుంచి క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ కేవీ కనకదుర్గ, సివిల్ సీఈ కోటేశ్వరరావు, సివిల్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, లోయర్ సీలేరు అధికారులు డీఈటీ వరప్రసాద్, ఏడీఈ కొండబాబు, సీనియర్ ఎకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, ఏఈ పవన్, ఏపీ జెన్కో పొల్లూరు, మోతుగూడెం ప్లాంట్ సివిల్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన

వ్యక్తిపై చీటింగ్ కేసు

కాకినాడ క్రైం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో భారీ ప్యాకేజ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జగన్నాథపురానికి చెందిన కె.వర్మ బీటెక్ పూర్తి చేశాడు. కాగా అతడి తండ్రి దశరథుడికి చిత్తూరు జిల్లాకు చెందిన హర్షవర్ధన్ అనే వ్యక్తితో చాలాకాలంగా పరిచయం ఉంది. ఈ క్రమంలో వర్మకు లండన్‌లో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని దశరథుడిని అతడు నమ్మించాడు. ఈ నేపథ్యంలో గతేడాది అతడినుంచి హర్షవర్ధన్ రూ.12లక్షల సొమ్ము వసూలు చేశాడు. అప్పటినుంచి ఉద్యోగం రాలేదు సరికదా తీసుకున్న రూ.12లక్షలకు హర్షవర్ధన్ సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తాము మోసపోయామని గ్రహించిన దశరథుడు గురువారం రాత్రి కాకినాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజశేఖర్‌కు పట్టం కట్టండి

ఉభయగోదావరి జిల్లాల పరిశీలకుడు, ఎమ్మెల్సీ చిరంజీవి




కాకినాడలోని టీడీపీ కార్యాలయంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సుకు హాజరైన పార్టీశ్రేణులు, మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి

కాకినాడ సిటీ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాజశేఖర్‌కు పట్టం కట్టాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఎన్నికల పరిశీలకుడు చిరంజీవి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విచ్చేశారు. ఈ సందర్భంగా పరిశీలకుడు చిరంజీవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రత్యక్షంగా జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటో గెలిపించుకోవాలన్నారు. ఓట్ల నమోదు ఆలస్యంగా మొదలైనా ఉభయ గోదావరి జిల్లాల్లో 3,15,261మంది ఓటర్లు నమోదు అయ్యారన్నారు. ఇందుకు కృషిచేసిన ఎమ్మెల్యేలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదులో కాకినాడ సిటీ నియోజకవర్గం ప్రథమస్థానం, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం ద్వితీయస్థానం, కాకినాడ రూరల్ నియోజకవర్గం తృతీయస్థానంలో నిలిచాయన్నారు. జిల్లా అధ్యక్షుడు నవీన్ మాట్లాడుతూ పార్టీకోసం అహర్నిశలు కష్టపడిన రాజశేఖర్‌ను నెగ్గించుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ మాట్లాడుతూ పార్టీశ్రేణులు ప్రణాళికాబద్ధంగా పని చేసి రాజశేఖర్‌ను నెగ్గించుకోవాలన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, రూరల్ నియోజకవర్గ కోకన్వీనర్ కటకంశెట్టి బాబి, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు బోళ్ల కృష్ణమోహన్, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, జొన్నాడ వెంకటరమణ పాల్గొన్నారు.

అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రానికి..

జాతీయస్థాయి అవార్డు

అంబాజీపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రానికి బెంగళూరుకు చెందిన ఐసీఏఆర్-ఎన్‌బీఏఐఆర్ సొసైటీ ఫర్ బయో కంట్రోల్ అడ్వాన్స్‌మెంట్ డాక్టర్ చందీష్ ఆర్ బళ్లాల్ టీమ్ అవార్డు ఫర్ అవుట్ స్టాడింగ్ ఎక్స్‌టెన్షన్ వర్క్ ఇన్ బయలాజికల్ కంట్రోల్ టీమ్ జాతీయస్థాయిలో లభించినట్లు పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు తెలిపారు. ఫిబ్రవరి 25నుంచి 27వ తేదీల్లో జరగనున్న సెంకడ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ బయోకంట్రోల్ కంట్రోల్, బయోకంట్రోల్ కంట్రిబ్యూషన్స్ టు వన్ హెల్త్ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కొబ్బరి, కోకోలో జీవనియంత్రణ పద్ధతులద్వారా పురుగులు, తెగుళ్ల యజమాన్యంపై జరిగిన పరిశోధనలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేస్తామన్నారు. కీటక విభాగానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.నీరజ, తెగుళ్ల విభాగం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్తలు ఎ.కిరీటి, డాక్టర్ వి.అనూష, డాక్టర్ పి.సునీతలు జాతీయ స్థాయిలో అవార్డును అందుకోనున్నారు. ఆరు దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన ఈ పరిశోధన స్థానం రైతులకు చేసిన సేవలకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం ఎంతో అభినందనీయమని ఉద్యాన పరిశోధన స్థానం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచండి

శిక్షణ తరగతుల్లో విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ జే. వేణుగోపాల్



సామర్లకోట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంచాలని విస్తరణ శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ జే. వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు ఈటీసీ ఆవరణలో రెండు రోజుల శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ క్షేత్రస్థాయిలో సద్వినియోగమయ్యేందుకు మరింత కృషిచేయాలని తెలిపారు. సామర్లకోట ఈటీసీ ఆవరణలో పీసా చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించినశిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ హాజరయ్యారు. అయిదు జిల్లాలకు చెందిన ఆయా పంచాయతీ కార్యదర్శులు 100 మంది హాజరయ్యారు. గిరిజనుల అటవీ హక్కులకు సంబంధించి బాధ్యతలు, హక్కులు, పీసా చట్టం (1996)పై అవగాహన కల్పించారు. ఒక్కొక్క బ్యాచ్‌లో 100 మంది కార్యదర్శులకు ఫిబ్రవరి 8 వరకు శిక్షణ ఇవ్వనునున్నట్టు చెప్పారు. జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరక్టర్ రామనాధం, ఫ్యాకల్టీలు శ్రీనివాసరావు, ఎం. చక్రపాణీరావు, నీహారిక, జగదీష్, వి.ప్రసాద్, వి. ఆంజనేయులు, పద్మజ, మొహిద్దీన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ..

కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి కృషిచేయాలని జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ పిలుపునిచ్చారు. వర్సిటీలోని అలూమ్నీ ఆడి టోరియంలో 1970-75 బ్యాచ్(ఈసీఈ) పూర్వ వి ద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వ హించారు. దీనికి ముఖ్యఅతిథిగా వీసీ హాజరయ్యారు. సభకు దీక్షిత్ అధ్యక్షత వహించారు. అనంతరం కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కైలాసరావును సత్కరించారు. కార్యక్రమంలో డెరెక్టర్లు కృష్ణప్రసాద్, బాలాజీ, లీలాకుమారి, తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి వీసీతో 1970-75 బ్యాచ్ ఈసీఈ పూర్వ విద్యార్థులు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

చేబ్రోలులో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గొల్లప్రోలురూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భారత రాజ్యాంగ ప్రాముఖ్యత అంశంపై ఈ పోటీలు జరిగాయి. సీఐటీయూ నాయకుడు నందీశ్వరుడు, వీరాస్వామి పాల్గొన్నారు.



పెద్దాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప



పట్టణంలో చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



రాజ్యసభ సభ్యుడి కార్యాలయంలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న కూటమి నాయకులు



సర్పవరంజంక్షన్: కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ, కటకంశెట్టి బాబీ, కూటమి నాయకులు

యువత లోకేశ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

● మంత్రి లోకేశ్ పుట్టిన రోజు వేడుకల్లో నాయకులు ● రక్తదాన శిబిరాలు, మహిళలకు చీరలు పంపిణీ



పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి లక్ష్మీదేవి, టీడీపీ నాయకులు



ఆటోడ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసుదాసు

కాకినాడ సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం కాకినాడ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ, రక్తదాన శిబిరం, పేదలకు అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి కేక్ కట్ చేసి పంచారు. ప్రత్యేక అతిథులుగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. 100 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసి, 500మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, జిల్లా నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఎంఏ తాజుద్దీన్, దేవు వెంకన్న, రామదేవు సీతయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడి కార్యాలయంలో..

రాష్ట్రంలోని యువత లోకేశ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని కూటమి నాయకులు పేర్కొన్నారు. కాకినాడలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో గురువారం టీడీపీ యువనేత, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ గుత్తుల రమణ, కూటమి నాయకులతో కలిసి జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణ్‌మూర్తి కేక్ కట్‌చేశారు. కూటమి నాయకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దాపురం: స్థానిక సుధా కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లోకేశ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ర్యాలీగా స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లి అక్కడ రోగులకు పండ్లు బ్రెడ్లు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోకేశ్ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, పాలకుర్తి శ్రీనుబాబు, చాగంటి గోపాలకృష్ణ, గుమ్మళ్ల రామకృష్ణ, అడబాల కుమారస్వామి, కొరిపూరి రాజు, ఎలిశెట్టి నాని, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

సర్పవరం జంక్షన్: సర్పవరం జంక్షన్ స్పందన ఫంక్షన్ హాల్లో టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ) ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్ పుట్టినరోజు పురస్కరించుకుని నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తగ్గ తనయుడుగా మంత్రి లోకేశ్ పార్టీబలోపేతం కోసం విశేషంగా శ్రమించారన్నారు. లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోన్న కటకంశెట్టి బాబీ వచ్చే ఏడాది లోకేశ్ పుట్టినరోజుని అధికార హోదా పదవిలో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు రోటరీ క్లబ్ సహకారంతో సుమారు 3వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకులకు అందించినట్లు టీడీపీ కోకోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో భారీ కేకు కోసిన అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాల, గౌడ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు కొల్లాబత్తుల అప్పారావు, మట్టా ప్రకాశ్‌గౌడ్, కూటమి నాయకులు పలివెల త్రిమూర్తులు, కరెడ్ల గోవిందు, తాటికాయల వీరబాబు, సోదె ముసలయ్య, సీతయ్యదొర, బండారు మురళీ, గుల్లిపల్లి శ్రీనివాస్, కాకరపల్లి చలపతిరావు, ఏటుకూరి నాగమణి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి ఆధ్వర్యంలో...

కాకినాడరూరల్ టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో వలసపాకలో పార్టీ నాయకులు, కార్యకర్తల నడుమ భారీ కేకు కట్‌చేసి అందిరికీ పంపిణీ చేశారు. రమణయ్యపేటలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో భారీ కేకు కట్‌చేశారు. ఈసందర్భంగా ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు, పండ్లు పంపిణీ చేశారు.

పిఠాపురం: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి కేక్‌ను కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాలు, కొత్తపల్లి మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మంత్రిలోకేశ్ పుట్టినరోజు వేడుకలను తోటపేట, పోలేకుర్రు టీడీపీ అధ్యక్షులు వడ్డమూరి సతీష్, సాధనాల వెంకట శివరామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి రాష్ట్ర తెలుగు యువత కార్య దర్శి ధూళిపూడి వెంకటరమణ బర్త్‌డే కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లను పంపిణీ చేశారు. టీడీపీ కార్యకర్తలు జక్కుల ప్రసాద్, పినిపేనాగేంద్రరావు, రేవుగోవ రాజు, జనిపల్లి ఈశ్వరరావు, సుభాస్, పోతుల విజయ భాస్కర్ పాల్గొన్నారు.

టిడ్కో గృహ లబ్ధిదారుల సర్వే నిర్వహించాలి

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 23(ఆంధ్రజ్యోతి): టిడ్కో ఫస్ట్ ఫేజ్‌లో గృహాలు పొందిన లబ్ధిదారుల సర్వే చేపట్టాలని నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గృహాలు పొందిన 1152 మందిలో ఎంత మంది లబ్దిదారులు ఆ గృహాల్లో నివశిస్తున్నారు? అనే విషయంపై సమగ్ర సర్వే చేపట్టాలని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆయన గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశమయ్యారు. లబ్ధిదారుల బయోమెట్రిక్ సర్వే సమగ్రంగా ఎలాచేపట్టాలనే విషయంపై శిక్షణిచ్చారు. టీపీఆర్వో శైలజ, యూపీఏ సెక్షన్ సూపరింటెండెంట్ సతీష్, అధికారులు పాల్గొన్నారు.

'ఫలితం వచ్చేంతవరకూ పోరాడాలి'

కాకినాడరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి):విద్యార్థినిలు ఫలితం వచ్చేంతవరకూ కష్టాలను అధిగమించి పోరాడాలని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ భావన సూచించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ స్త్రీల నాయకత్వ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థినిలు విద్య ద్వారా మహిళా సాధికారత సాధించగలరన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, కులజీత్ కౌర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలోని పీఆర్ కళాశాల రోడ్డులోని శాంతినివాస్ లాడ్జి, పాత బస్టాండ్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై చెత్త తొలగింపు, రహదారులు, డ్రెయిన్లు శుభ్రపరచడం, సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించారు. ఈపర్యటనలో కమిషనర్ వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

26న మహా శివరాత్రి ఉత్సవాలపై గ్రామసభ

సామర్లకోట, జనవరి 23:(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్ర మైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకూ జరుగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు వివిధ శాఖలకు చెందిన అధికారులతో గ్రామసభ ఈనెల 26న ఆదివారం ఉదయం 10గంటలకు ఆలయ ఆవరణలో జరుగనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్యక్షతన నిర్వహించనున్న ఈ గ్రామసభలో మహాశివరాత్రి ఉత్సవాలకు నిర్వహించే ఏర్పాట్లపై అధికారులు, భక్తమండలి సభ్యులతో సమీక్షించనున్నందున హాజరుకావాలని ఈవో తెలిపారు.

'బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి'

సామర్లకోట, జనవరి 23:(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ రానున్న కాలంలో మరింత బలోపేతానికి పార్టీలోని శ్రేణులు కృషిచేయాలని కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం సామర్లకోటలోని బీజేపీ నాయకులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొరను పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డాక్టర్ చిన్నయ్యదొర నూతన అధ్యక్షుడిగా శాలువా కప్పి పూలమాల వేసి అభినందించారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సభలను విజయవంతం చేయాలి

సామర్లకోట, జనవరి 23: (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 6 నుంచి 9వరకూ శ్రీకాకుళంలో జరుగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ పేర్కొన్నారు. సామర్లకోట విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో శుక్రవారం నియోజకవర్గ 4వ మహాసభ సప్పా సూరిబాబు అధ్యక్ష తన జరిగినట్లు పార్టీ నాయకులు సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

నూతన కమిటీ అధ్యక్షుడిగా కిషోర్

సామర్లకోట ఏఐవైఎఫ్ కమిటీ నూతన కార్యవర్గ గౌరవాధ్యక్షుడిగా కె.కిషోర్, అధ్యక్షుడిగా సూరిబాబు, ఉపాధ్యక్షులుగా రమణ, రాజేష్, సందీప్, లోవరాజు, లక్ష్మీనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీకాకుళం మహాసభల పోస్టర్‌ను పార్టీ నాయకులు ఆవిష్కరించారు.

ఘనంగా డాక్టర్ కవిశేఖర్ ఉమర్ ఆలీషా వర్ధంతి

సర్పవరంజంక్షన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమర్ ఆలీషా రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ కాకినాడ పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు ఆధ్వర్యంలో గురువారం బోట్‌క్లబ్ వద్ద డాక్టర్ కవిశేఖర ఉమర్ ఆలీషా వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఉమర్ ఆలీషా పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా సోదరులు అహ్మద్ ఆలీషా, రిటైర్డు ఆర్టీవో చిక్కం రామచంద్రరావులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పక్షులు, జంతువులు చలి వేంద్రం నిర్వాహకులు, ట్రస్ట్ సభ్యులకు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు ఎల్లమాంబ, కాకినాడ లక్ష్మి, చిర్ల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎంపీ సుడిగాలి పర్యటన

జీజీహెచ్ (కాకినాడ), జనవరి (ఆంధ్ర జ్యోతి): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ సుడిగాలి పర్యటన చేశారు. ఆయన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసన్‌తో కలిసి అత్యవసర విభాగం, ట్రామా, సర్జికల్, మెటర్నిటీ, ఎంఆర్ఐ, సీటిస్కాన్, పల్మనాలజీ వార్డు, ఓపి విభాగం, నర్సింగ్ స్కూల్ తదితర విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఆసుపత్రి ప్రాంగణంలో రూ.42కోట్లతో నిర్మిస్తున్న ఎంసీహెచ్ బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీ పలు వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు, క్షతగాత్రులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయిని అయిన కాకినాడ జీజీహెచ్‌ను మరింత అభివృద్ధి పరచి పేద ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డా. ఎస్ రాజ్‌కుమారి, డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ఎన్ శ్రీధర్, వివిధ విభాగాల హెచ్‌వోడిలు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పాడ బీచ్ రోడ్డులో మరమ్మతులకు శ్రీకారం

కొత్తపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డులో మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. ఇటీవల బీచ్ రోడ్డులో రోడ్డంతా గోతులే అనే శీర్షికన వెలువడిన కథనంపై అధికారులు స్పందించారు. దీంతో గురువారం నుంచి ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఎంతో కాలంగా పడిన గోతులను పూడ్చే పనులను ముమ్మరం చేశారు. ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డులో జరిగే పనులను కాకినాడ ఎంపీ తంగెళ్ళ శ్రీనివాస్ పరిశీలించారు. మరమ్మతు పనులను నాణ్యతగా చేపట్టాలని ఎంపీ శ్రీనివాస్ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

నిర్మాణాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించరా

గొల్లప్రోలు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల నిర్వహణలో నిబంధనలు పాటించకపోవడంపై కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గొల్లప్రోలు పట్టణంలో ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డుకు పగుళ్లివ్వడం, సీఎస్ఆర్ నిధులతో డంపింగ్ యార్డుకు నిర్మించిన కాంపౌండ్‌వాల్ చేతులతో తోయగానే పడిపోయిన విషయాన్ని వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో అభివృద్ధి పనులు ఇలాగేనా శీర్షికతో ప్రచురితమైన వార్తా కథనానికి ఎంపీ స్పందించారు. గొల్లప్రోలు పట్టణానికి గురువారం వచ్చి సదరు పనులను పరిశీలించారు. సీసీ రోడ్డుకు పగుళ్లు ఇచ్చిన ప్రాంతాలను పరిశీలించారు. రోడ్డు నాణ్యత పరిశీలన నిమిత్తం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపాలని నగర పంచాయతీ కమిషనర్ కనకారావును ఆదేశించారు. అనంతరం సీఎస్ఆర్ నిధులు రూ.7లక్షలతో నిర్మించి చేతులతో తోయగానే పడిపోయిన డంపింగ్‌యార్డు కాంపౌండ్‌వాల్‌ను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాల్లో ప్రీకాస్ట్ విధానం పాటించేందుకు అవకాశం ఉందా, అలా లేనప్పుడు ఆ విధానాన్ని పాటించారు అని ఎంపీ ఉదయ శ్రీనివాస్ పబ్లిక్‌హెల్త్ ఏఈ సురేంద్రపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పుడు ఈ నిర్మాణానికి వినియోగించిన నిధులన్నీ వృథాయే కదా అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో ఇలా నాణ్యత లేకుండా పనులు చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరుందతీయపేటలో కమ్యూనిటీహాలు, పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని ఆ ప్రాంతానికి చెందిన యువకులు ఎంపీని కోరారు. ఎంపీ వెంట జనసేన నాయకులు, పలువురు అధికారులు ఉన్నారు.



ఉప్పాడ బీచ్‌రోడ్డులో మరమ్మత్తులను పరిశీలిస్తున్న కాకినాడ ఎంపీ శ్రీనివాస్

వరిపై జింకుదాతు లోపం, గంధకం తెగులు

● గుర్తించిన వ్యవసాయాధికారులు

గొల్లప్రోలు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా వరినాట్లు వేసిన పొలాల్లో జింకు దాతు లోపంతోపాటు గంధకం తెగులును వ్యవసాయాధికారులు గుర్తించారు. గొల్లప్రోలు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో దాళ్వా వరిసాగు ఆలస్యమైంది. జనవరి నాల్గవ వారం వచ్చినా ఇంకా నాట్లు కొనసాగుతున్నాయి. ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాల్లో ఇవి అధికంగా కనిపిస్తున్నాయని గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తెలిపారు. దమ్ముచేసిన వెంటనే నాట్లు వేసిన పొలాల్లో గంధకం తెగులు కనిపిస్తున్నదని, దుబ్బు పైకి లాగితే కుళ్లిన కోడిగుడ్లు వాసన వస్తుందని చెప్పారు. దీని నివారణకు పంట పొలం నెర వచ్చేవరకూ ఎండబెట్టాలని, లేనిచో ఇద్దరు కూలీలను పెట్టి కలుపు తీయించాలని తెలిపారు. ఎకరానికి 25కిలోల యూరియా వేయాలని సూచించారు. నాట్లు పూర్తయిన దగ్గర నుంచి పిలక దశ వరకూ జింకు లోపం కనిపిస్తుందని తెలిపారు. దీని నివారణకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని చెప్పారు.చీలేటెడ్ జింకు ఎకరాకు 150 గ్రాములను వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు.

రబీలో సస్యరక్షణ కీలకం

పెద్దాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రబీ సాగులో సస్యరక్షణ కీలకమని వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ ఎం.రామభద్రరాజు అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో నిర్వహించిన సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. ప్రస్తుతం వరిలో కాండం తొలిచే పురుగు, కాండం కుళ్లు తెగులు ఆశించినట్లు తమ దృష్టికి వచ్చిందని, వాటి నివారణకు స్థానిక వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు మేలైన సస్యరక్షణ చర్యలను చేపట్టాలన్నారు. ప్రస్తుతం రబీలో వరి, మొక్కజొన్న అపరాలు, శెనగ, మినుములు సాగు ఉన్నాయని, ప్రస్తుతం ఆ పంటలు ఆరోగ్య వంతంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవరావు, చల్లా నరసింహారావు పాల్గొన్నారు.

ముగిసిన అనఘా దత్తక్షేత్రం బ్రహ్మోత్సవాలు

పిఠాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో ఉన్న శ్రీపాద శ్రీవల్లభ అనఘా దత్తక్షేత్రంలో నాలుగు రోజులుగా జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంరాత్రితో ముగిశాయి. అనఘాదేవి సమేత దత్తాత్రేయస్వామికి అభిషేకం నిర్వహించారు. దత్త మాల మంత్ర హోమం, రుద్రయాగ మహాపూర్ణాహుతి కలశ ఉద్వాసన, మహా సంప్రోక్షణ కార్యక్రమాల్లో మైసూరు అవదూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామీజీ, ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీలు పాల్గొన్నారు. భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యను అందించాలి

గొల్లప్రోలురూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని జిల్లా గృహనిర్మాణ సంస్థ పీడీ, పిఠాపురం నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశించారు. గొల్లప్రోలు మండలం కొడవలిలోని మండలపరిషత్ ప్రాథ మిక, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల డేటా, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరుని ఆయన పరిశీలించారు. ఎంపీడీవో కర్రి స్వప్న పాల్గొన్నారు.

గ్రావెల్‌ను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

గొల్లప్రోలు రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామ పరిధిలో పుష్కర కాలువ నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారన్న సమాచారంతో గురువారం తెల్లవారుజామున ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి డ్రైవర్ వాసంశెట్టి శ్రీనుని అరెస్టు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుడివాడలో ఉచిత పశువైద్య శిబిరం

పెద్దాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచి త పశువైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ టీడీపీ నేత చాగంటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కాండ్రకోట పశుసం వర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎం.గంగాభవాని పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీఏఏ చక్రలక్ష్మీ, పూర్ణ, ప్రతాప్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ మహా అన్నదాన క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడసిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే మహాశివరాత్రి రోజున శ్రీశైలం మల్లికార్జున మహా క్షేత్రంలో అఖిల భారత నాయీ బ్రాహ్మణ అన్నదాన సత్ర సంఘం కార్యదర్శి అత్మకూరు శివయ్య నేతృత్వాన చేపట్టబోయే మహా అన్నదాన కార్యక్రమం క్యాలెండర్‌ను గురువారం కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా అధ్యక్షుడు కింతాడ సత్యనారాయణ, స్వయంవరపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐ నిర్వాకంపై ఎస్పీకి ఫిర్యాదు

కాకినాడ క్రైం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి సరిహద్దు విషయంలో తలెత్తిన వివాదంలో ప్రశ్నించినందుకు ఓ సీఐ కొట్టి గాయపర్చిన సంఘటన సామర్లకోటలో చోటుచేసుకుంది. ఈ విషయంపై బాధితుడు గురువారం ఎస్పీని ఆశ్రయించి తన గోడును విన్నవించాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సామర్లకోట మండలం చంద్రంపాలెం గ్రామానికి చెందిన తూటే సునీల్ కుటుంబంపై తూటే కిరణ్‌కుమార్ కుటుంబం వారి ఆస్తి ధ్వంసం చేసినట్లు సామర్లకోట పీఎస్‌లో కేసు పెట్టగా పోలీసులు సునీల్ ఇంటికి వచ్చి స్టేషన్‌కు రమ్మని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం స్టేషన్‌కు వెళ్లి కేసు వివరాలు అడుగుతుండగా నువ్వు నన్ను రూల్స్ అడుగుతావా అంటూ సునీల్‌ను విపరీతంగా కొట్టి, నిర్బంధించి వీడు ఎలా బయటకు వెళతాడో చూస్తాను అని చెప్పి మొబైల్ ఫోన్ లాక్కున్నట్లు ఎస్పీకి ఇచ్చినఫిర్యాదులో పేర్కొన్నాడు.

పిఠాపురంలో ఘనంగా లక్కీఫ్రెండ్స్ కిట్టీ పార్టీ

పిఠాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో గురువారం లక్కీ ఫ్రెండ్స్ కిట్టీ పార్టీ ఘనంగా జరిగింది. లక్కీ ఫ్రెండ్స్ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఆర్యవైశ్య మహిళలు పట్టణంలోని ఒక ప్రవేటు ఫంక్షన్‌హాలులో కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు కార్యక్రమాలు, సరదా పోటీలు నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



'నేతాజీ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలి'



పాత పోలీసుస్టేషన్ సెంటర్‌లో నేతాజీ సుభాషచంద్రబోస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు, విద్యార్థులు

పిఠాపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాషచంద్రబోస్ పోరాట పటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలని వివిధ ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సూచించారు. నేతాజీ 128వ జయంతి సందర్భంగా పిఠాపురం పట్టణంలోని పాత పోలీసుస్టేషన్ సెంటర్‌లోగల సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. నేతాజీ విగ్రహం ఉన్న ప్రాంతాన్ని నేతాజీ సుభాష్‌చంద్రబోస్ సెంటర్‌గా పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఏటూజెడ్ వలంటీర్ సారా శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు గట్టి శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ సూర్యనారాయణ, బొజ్జా పెదకాపు, కొండేపూడి శంకరరావు, కరణం విశ్వనాథం, చెల్లుబోయిన నాగేశ్వరరావు, కర్రి రాంబాబు, హనుమంతరాయ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

● సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, నాయకులు బుర్రి మురళీధరరావు, తోట ఏడుకొండలు, కర్నీడి తాతీలు, పసుపులేటి సత్యనారాయణ, అడబాల వీరమోహనరావు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన జయంతి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కాశీవిశ్వనాథం, లెక్చరర్లు పాల్గొని బోస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

గొల్లప్రోలు : నేతాజీ జయంతి సందర్భంగా గొల్లప్రోలు పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మలిరెడ్డి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ పంది శ్రీను, హెచ్ఎం ప్రకాష్, చల్లా ఉమారాజ మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

నంబి ఆశయ సాధనకు కృషి చేయాలి

జగ్గంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జనశక్తి రాష్ట్ర నాయకుడు నంబి నరసింహయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని రైతు కూలీ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. నరసింహయ్య వర్థంతిని రంగవల్లి నగర్‌లో గురువారం నిర్వహించారు. పీడిత ప్రజల విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఎర్రజెండాను చివరి శ్వాస వరకు వదల్లేదన్నారు. ఆయన కుటుంబం మొత్తం పేదల కోసం ప్రాణాలర్పించిందన్నారు. నాయకులు కర్నాకుల వీరాంజనేయులు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



రంపచోడవరంలో ఎమ్మెల్యే శిరీష,విజయభాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

రంపచోడవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రంపచోడవరంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే మిరియాల శిరీషవిజయభాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన కూడలిలో కేక్ కట్ చేశారు. వృద్ధులు, పేదలు, మహిళలు, దివ్యాంగులకు వస్త్రాలు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఏడు మండలాల పరిధిలోని సుమారు 693 కుటుంబాలు టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబురమేష్, నియోజకవర్గ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు పార్టీలో చేరినవారిని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, ఏడు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరు: మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం చింతూరు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇల్లా చిన్నారెడ్డి మాట్లాడారు. నారా లోకేష్ యువగళంతో రాష్ట్రమంతా సుడిగాలి పర్యటన చేసి పార్టీని బలోపేతం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు రామారావుచౌదరి, వెంకటేశ్వరరావు, నూకాచారి, ఆసిఫ్, మధుసూధనరావు, సరేష్ చౌదరి, తమ్మయ్య, ప్రసంగి సత్యవతి, అచ్చమ్మ, నాగమణి, కాంతమ్మ, శ్రీనివాసరావు, సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు. చట్టి కూడలిలో లోకేష్ జన్మదిన వేడుకల్లో టీడీపీ నాయకులు జమాల్‌ఖాన్, తుర్రం ముత్తయ్య, శ్రీరాం, రామారావు పాల్గొన్నారు.

ఎటపాక: ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన ఎటపాక, పురుషోత్తపట్నం, గన్నవరం, తదితర గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎటపాకలో టీడీపీ సీనియర్ నాయకులు పాటి చలపతి, కిలారు వెంకన్న, పూరేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు, శ్రేణులు కేక్ కటింగ్ నిర్వహించారు. ఎటపాకలోనే అరకు పార్లమెంటరీ కార్య దర్శి ముప్వా శ్రీనివాస్ ఆధ్వర్యంలో సరోజిని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, అభాగ్యులకు పాలు, పండ్లు అందజేశారు. పురుషోత్తప ట్నంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, విజ్జగిరి రవితేజ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు కడియాల వెంకటేశ్వరరావు, పాటిసంపత్, బాచినేని శ్రీకాంత్, బొల్లా పుల్లయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూనవరం: మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలోను, కాచవరంలోను పార్టీ కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ కన్యకాపరమేశ్వరి కేక్ కట్ చేయగా కాచవరంలో మాజీ ఎంపీ సోడే రామయ్య కేక్ కట్ చేశారు. టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ పార్టీకి భవిష్యత్ నాయకుడు నారా లోకేష్ అన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, మధుసూదనరావు, చెలకాని ఉమామహేశ్వరావు, షరీఫ్, దాసరి నాగేశ్వరరావు, గడేశుల ప్రేమ్‌చంద్, గడేశుల రంజిత్ పాల్గొన్నారు.

దేవీపట్నం: మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం ఇందుకూరులో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోళ్ళ చంటిబాబు, చవలం శివరామకృష్ణ, ముచ్చు నాగేశ్వరరావు, చారపు రాంబాబు, కీర్తి గంగరాజు, ఇరేటి బ్రహ్మాజీ, కదికొండ గౌరీశ్వరి, ముచ్చు బాబురావు, పల్లపాటి నాగేశ్వరరావు, లంక హరి, రాచ శ్రీనివాసరెడ్డి, దబ్బా నాని, కర్రి రాజీవ్, మల్లేష్, పాతాళ పండు, జనసేన నాయకులు కొమరం దొరబాబు, కారం దుర్గాప్రసాద్, కొండ్ల సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: మండల కేంద్రంలోని రేఖపల్లి జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు తెలుగు తమ్ముళ్ళు ఘనంగా జరుపుకున్నారు. మండల ఎన్డీయే కూటమి నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్ర మంలో మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, బొర్ర నరేష్, ముత్యాల సిద్ధార్థ, సవలం రాజు, బురక కన్నారావు, బొర్ర ఆదినారాయణ,బీరక సూర్యప్రకాష్‌రావు, మోహన్, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

మోతుగూడెం: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో ఎంపీటీసీ కరకా వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్టీఆర్ భవన్‌వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం డొంకరాయి ఎంపీపీ, జడ్పీ హెచ్ స్కూల్స్‌లో విద్యార్థులతో కలిసి కేట్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు,బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మావూరి వీర వెంకట సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, మద్దెల యాకోబు, శివ, వేణు,మూర్తి, నరసింహమూర్తి, నూకరత్నం, సన్యాసమ్మ, తాళి, సహదేవ్ కూటమి పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన నాయకులు



ఎటపాకలో కేక్‌ను ఒకరినొకరు తినిపించుకుంటున్న నాయకులు



కూనవరం టీడీపీ కార్యాలయంలో ...



మోతుగూడెంలో కేక్ కట్ చేస్తున్న కూటమి నాయకులు



దేవీపట్నంలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న దృశ్యం



వీఆర్‌పురం: రేఖపల్లిలో కేక్‌కట్ చేస్తున్ననాయకులు

అబ్బాయి జయంతి

తొండంగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్ర స్థాపకుడు అచ్చా అబ్బాయి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకులు భూమానంద భారతి ఆధ్వర్యంలో గురు వారం అబ్బాయి విగ్రహానికి పూలమాలలువేసి ప్రత్యేక పూజలు జరిపారు. సీతారాముల కల్యాణం నిర్వహించారు. నామ సంకీర్తన, వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బిక్కినను కలిసిన వెంకట్రావు

ప్రత్తిపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన బిక్కిన విశ్వేశ్వరరావును బీజేపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పెద్దాపురం మండలం కట్టమూరులోని బిక్కిన స్వగృహానికి ఉమ్మడి కార్యకర్తలతో తరలివెళ్లి అభినందించారు. అలాగే బీజేపీ మండల అధ్యక్షుడు ఊటీ వీరబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు కట్టమూరు వెళ్లి బిక్కినను సన్మానించారు.

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు







జగ్గంపేట: కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, ఏలేశ్వరం: రోగులకు పండ్లు,పాలు అందజేస్తున్న కౌన్సిలర్లు, ప్రత్తిపాడు: ఉత్తరకంచిలో జరిగిన వేడుకల్లో సర్పంచ్

జగ్గంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు టీడీపీ గండేపల్లి మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకేశ్ భవిష్యత్తులో మరిన్న ఉన్నత పదవులు అధిరోహించాలని కోరారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, మంగరౌతు రామకృష్ణ, అడబాల భాస్కరరావు, జంపన సీతారామచంద్ర వర్మ, కంచే రామకృష్ణ, కంటిపూడి సత్యనారాయణ, రేఖ బుల్లిరాజు, ముండ్రు ఎర్రబాబు, బొల్లంరెడ్డి రామకృష్ణ, కంచుమర్తి రాఘవ, శిలామంతుల వీరబాబు, వేములకొండ జోగారావు, నకిరెడ్డి సూర్యవతి, మండిగ గంగాధర్, అక్కిన సుదర్శన్‌రావు, ఉప్పలపాటి బుల్లి అబ్బులు, మండపాక వెంకటేశులు, దాట్ల రమేష్ పాల్గొన్నారు.

భరోసా కల్పిస్తున్న లోకేశ్

అన్నవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పుట్టిన రోజు వేడుకలు గురువారం పార్టీ శ్రేణులు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఘనవిజయానికి లోకేష్ ఎంతో కృషిచేశారని, కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తున్న నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో బొమ్మిడి సత్తిబాబు, రాజాల చిట్టిబాబు, మెరపల నరసయ్య, కడుపుకుట్ల కృష్ణ, పంచదార్ల సత్యనారాయణ, బండారు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తెచ్చారు

రౌతులపూడి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చారని టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అన్నారు. రౌతులపూడిలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు ఆధ్వర్యంలో, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో టీడీపీ నేతలు మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

లోకేశ్ ఆధ్వర్యంలో పెట్టుబడుల వరద

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. నెల్లిపూడిలో పార్టీ మండల అధ్యక్షుడు బద్దిరావు, కత్తిపూడి, శంఖవరం తదితర గ్రామాల్లో నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు వరదలా వస్తున్నాయని, వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో పెట్టుబడులు కోసం లోకేశ్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బద్ది రమణ, టీఎన్ఎస్ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, పాలు పంపిణీ

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం పెద్దనాపల్లి గ్రామంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి టీడీపీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి నేతృత్వంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ నగరం పంచాయతీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి స్థానికులకు పంచారు. పరవాడ రమేష్, కోట్ల కృష్ణ, సామంతుల కిషోర్, బుగత శ్రీనివాస్, సామంతుల గోపి, వాగు రాజేష్, గెద్ద అప్పన్న, కిలారి రామచంద్రరావు, సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, చెక్కపల్లి బూరయ్యలు కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంచారు. ఉత్తరకంచిలో సర్పంచ్ మంతెన వెంకటరమణ, సుబ్బారెడ్డి సాగర్ ఇళ్ల అప్పారావు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ధర్మవరం, ఏలూరులలో బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, రొంగల సత్యనారాయణ, అడ్డాల త్రిమూర్తులు కేక్‌లు కట్ చేశారు. ప్రత్తిపాడులో జరిగిన కార్యక్రమంలో చలంకూరి భాను, గోవింద నాయుడు, మూరా వరప్రసాద్, ముత్యాల రాంబాబు, రావూరి తాతాజీ, పోలిశెట్టి శ్రీను, గోగుల వెంకటేశ్వరరావు, మెలిపాక నాగు పాల్గొన్నారు.

పండ్లు, స్వీట్లు పంపిణీ

తొండంగి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం మండలంలో నిర్వహించారు. బెండపూడిలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిపారు. పేదలకు పండ్లు, స్వీట్లు పంచారు. బూసాల శ్రీనివాసరావు, పాలచర్ల యర్రబ్బు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించాలి

తుని రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో అఖండ మెజార్టీ సాధించేందుకు కార్యకర్తలు సన్నద్ధం అవ్వాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. గురువారం తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, విశాఖ ఎమ్మెల్సీ చిరంజీవి సమావేశానికి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలి ఎన్నిక ల్లో పేరాబత్తుల విజయం ఖాయమన్నారు. జ్యోతుల నవీన్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించే శ్రేణులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు తన వంతు కృషి ఉంటుందన్నారు. సీనియర్ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతం నీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ, చొక్కా అప్పారావు, గాడి రాజబాబు, అంకంరెడ్డి రమేష్, దంతులూరి శ్రీనివాసరాజు, మల్ల గణేష్, కుక్కడపు బాలాజీ, తుమ్మల చిన్ని, కోడా వెంకటరమణ, బంటుపల్లి అన్వేష్, దూలం మురళీకృష్ణ, కొయ్యా శ్రీను,వెలగా వెంకట కృష్ణారావు, కాలిపోయిన చంద్రరావు, పక్కుర్తి వంశీకృష్ణ, అప్పన రమేష్, కరపా అప్పారావు, పోలిశెట్టి రామలింగేశ్వర, చిటికెల శ్రీనివాసరావు, జక్కాన రామునాయుడు, మంతిన గంగాధర్, సుర్ల బోడయ్య, బోనం చినబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యనమల, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి తదితరులు

పథకాలు పారదర్శకంగా అందాలి

తుని రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ తదితర శాఖల అధికారులతో గురువారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో యనమల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఎమ్మెల్యే యనమల దివ్య బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను శాఖల వారీగా సమీక్షించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.17కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్డీవో శ్రీరమణి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రావుపాల్గొన్నారు.

ప్రొఫెసర్ రమేష్‌కి డాక్టరేట్



గండేపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ఎన్‌వీఎస్‌సీ రమేష్ హిమాచల్‌ప్రదేశ్‌లోని అర్ని యూనివర్శిటీ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (డాక్టరేట్) పొందినట్లు ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. అర్ని వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్ పెద్ది నేతృత్వంలో ఆదిత్య వర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ డోలా సంజయ్ సహకారంతో రమేష్ సమర్పించిన సిద్ధాంతానికి డాక్టరేట్ వచ్చింది.

రాజశేఖర్ విజయం కోసం అందరూ కృషి చేయాలి

జగ్గంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికలపై ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అబ్జర్వర్‌గా ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఉభయ గోదావరి జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్సీ ఎన్నికలకు బూత్ ఇన్‌చార్జ్‌లను నియమించి వారికి బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను గెలిపించాలని కోరారు. జ్యోతుల నవీన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు వేయించి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి రావు మాట్లాడుతూ ఓట్లువేసే విధానాన్ని సమూలంగా వివరించి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి ఓట్లు అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, ఎస్వీఎస్ అప్పలరాజు, తోట గాంధీ, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, కోర్పు పోతుల మోహన్‌రావు, మంగ రౌతు రామకృష్ణ, అడబాల భాస్కరరావు, బస్వా చినబాబు, ఉంగరాల రాము, కందుల చిట్టిబాబు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే జరపాలి

తొండంగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే రీసర్వే జరపాలని, రైతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లోను రీసర్వే జరపొద్దని పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి తహశీల్దార్‌ను మురార్జీని ఆదేశించారు. గురువారం ఆమె కృష్ణాపురం గ్రామంలో జరుగుతున్న రీసర్వే తీరును పరిశీలించారు. ఎటువంటి వివాదాలకు తావులేని రీతిలో సర్వే జరగాలన్నారు. రైతులకు నోటీసులిచ్చి వారి సమక్షంలో సర్వే జరిపి విస్తీర్ణాన్ని తెలపాలన్నారు. మండలంలో ఉన్న 15 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటికే 10గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మిగిలిన ఐదు గ్రామాల్లో సర్వే ప్రారంభించినట్లు తహశీల్దార్ వివరించారు. ముందుగా ప్రభుత్వ భూముల్లో సర్వే ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఆర్ఐ రాజారావు, డిటి వీరేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ చిట్టిమళ్ల మృతి



రౌతులపూడి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): లచ్చిరెడ్డి పాలెం మాజీ ఎంపీటీసీ చిట్టిమళ్ల సింహచలం అనారోగ్యంతో గురువారం మృతి చెందినట్టు బంధువులు తెలిపారు. ఎంపీటీసీగా గ్రామానికి ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు.

ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రంపచోడవరం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, చింతూ రు డివిజన్లలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. వై.రామవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం, చింతూరు ఈఎంఆర్ఎస్ పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో బాలురు-30, బాలికలు-30 అడ్మిషన్లు ఉంటాయన్నారు. విద్యార్థులు ఫిబ్రవరి 9వ తేదీలోగా https://tseeis-cet.apcfss.in/ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 25న నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు దగ్గర్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

'జాతీయరహదారిలో నష్టపోయిన వారికి న్యాయం చేస్తాం'

రాజవొమ్మంగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని 516 జాతీయరహదారి నిర్మాణ పనుల్లో భాగంగా గృహాలు, షాపులు, దేవాలయాలు కోల్పోయి నష్టపరిహారం అందని వారికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందే విధంగా చర్యలు చేపడతామని రాజవొమ్మంగి తహసీల్దార్ అల్లు సత్యనారాయణ గురువారం తెలిపారు. మండలంలోని జడ్డంగి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ, అప్రోచ్ రోడ్లను పరిశీలించారు. దీనిపై కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. నష్టపోయిన గృహాలు, దేవాలయాలకు నష్టపరిహారం గురించి సబ్‌కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారం అయ్యేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్, సీఐ సన్యాసినాయుడు, జడ్డంగి ఎస్ఐ చినబాబు, వీఆర్వో నానాజీ, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, సింగిరెడ్డి రామకృష్ణ, హైవే సిబ్బంది ఉన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

● ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో జేకేసీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్

ఎటపాక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జేకేసీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ సూచించారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లకుంట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండలస్థాయి ఆటల పోటీల ముగింపు కార్యక్రమంలో జామాల్‌ఖాన్ పాల్గొని, విద్యార్థు లను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎంఈవో సరియంరాజులు, వైఎస్ ఎంపీపీ మంగేశ్వరరావు, పుట్టి రమేష్ పాల్గొన్నారు.

నేతాజీ జయంతి వేడుకలు

జగ్గంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి జగ్గంపేట శ్రీప్రజ్ఞ విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డైరెక్టర్లు మట్టే శ్రీనివాసరావు, బండారు శ్వేత స్కూల్ హెచ్‌ఎం సోఫియా, కాలేజి ప్రిన్సిపాల్ అబి, కాలేజ్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, మణి, జ్యోతి, దేవి, శిరీష్ తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సేవా కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రత్తిపాడు,(ఆంధ్రజ్యోతి): సాయుధ పోరాటం ద్వారానే బ్రిటీష్ పాలన అంతమొందుతున్న నమ్మిన ధీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ధ్యాన మండలి అధ్యక్షుడు దొడ్డిపట్ల సోమన్న దొర కొనియాడారు. ధర్మవరంలో నేతాజీ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. మాజీ మండల ఉపాధ్యక్షుడు బొల్లు కొండబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బొల్లు వెంకటేశ్వరరావు, చుక్కల సత్యనారాయణ, తోపాటి బాబూరావు, కుప్పిన నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక కోనేటి బడి వద్ద నేతాజీ విగ్రహానికి పైల విజయ్, విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో పూలమాలలు వేసి నివాలర్పించారు. అలమండ దుర్గా వెంకట ప్రసాద్, కావలి శ్రీనివాస్, కటకం కిరీటి, ఆర్.గురవయ్య, అలమండ వీరరాఘవ స్వామి, ఉడతల రమణారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

కోటనందూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): భీమవరపుకోట గ్రామంలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. 15పశువులకు చూడు పరీక్షలు, 18పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. 132 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేశారు. మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కరసత్య నారాయణ, తాండవ వైస్ చైర్మన్ మేడపురెడ్డి జోగిబాబు, ఆళ్ల పరమేశ్వరరావు, పశువైద్యాధికారి రత్న తేజ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జగ్గంపేట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): 33కేవీ రాజపూడి ఫీడర్ పరిధిలో చెట్లు నరికివేత, మరమ్మతులు, ఏబీ స్విచ్ ఎరెక్షన్ కారణంగా శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.వీరభద్రరావు తెలిపారు. రాజపూడి, కొత్తూరు, మల్లిశాల, వెంగయమ్మపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారామపురం, జగ్గంపేట జేహెచ్‌సీ, బాలాజీ రైస్ మిల్లులకు సరఫరా ఉండదన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూ పూజలు

అన్నవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడిని గురువారం జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు, ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందచేయగా ఈవో స్వామివారి ప్రసాదం అందించారు.

పాఠశాలల్లో వాస్తవ నమోదు పరిశీలన

తొండంగి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా పాఠశాలల్లో ఉన్న వాస్తవ నమోదును అధికార్ల బృందం పరిశీలించింది. ఎంపీడీవో రాజేశ్వరరావు ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, వాస్తవంగా ఉన్న విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్య తదితర వివరాలను నమోదు చేశారు. ఎంఈవో అనిసెట్టి సుబ్బిరెడ్డి, సీర్పీలు ప్రతాప రెడ్డి, శీల, మీరాసాహెబ్ తదితరులు పలు పాఠశాలల్లో ఉన్న వివరాలను నమోదు పరిశీలించారు.

'దిశ' సభ్యురాలిగా సర్పంచ్

కిర్లంపూడి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ దిశ సభ్యురాలుగా జగపతినగరం గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలతను నియమించారు. ఈసందర్భంగా గురువారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు చేస్తున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తానన్నారు. కమిటీ చైర్మన్‌గా ఎంపీ తంగెళ్ల శ్రీనివాస్ వ్యవహరిస్తారని, తొమ్మిది మంది కమిటీ సభ్యులు ఉంటారన్నారు.